www.prajanaava.in
Telugu Daily
# ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల : 5.00
Published from: Karimnagar, Circulated to: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి :1 | సంచిక : 360 | శనివారం | 8 జూన్ 2024



ఐర్లాండ్‌పై కెనడా విజయం 8 లో..



# ఎన్‌డీఏ పక్షనేతగా మోడీ ఏకగ్రీవ ఎన్నిక

## రాజ్‌నాథ్ ప్రతిపాదనకు అమిత్ షా మద్దతు

### మద్దతు తెలిపిన ఎన్‌డీఏ నేతలు బాబు, నితీశ్ తదితరులు
### మోడీ విజినరీ నేత అంటూ చంద్రబాబు పొగడ్తలు
### దేశానికి సరైన సమయంలో దొరికి సరైన నేత అంటూ కితాబు

**న్యూఢిల్లీ, జూన్ 7 :** ఎన్డీయే పక్ష నేతగా నరేంద్ర మోడీ మూడోసారి ఎన్నిక య్యాడు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఎన్డీయే పార్ల మెంటరీ పక్ష సమావేశంలో ఎన్డీయే కూటమి ఈ మేరకు మోడీని ఏక గ్రీవంగా ఎన్నుకుంది. ఎన్డీయే పక్ష నేతగా మోడీ పేరును రాజనాథ్ సింగ్ ప్రతిపాదించగా అమిత్ షా, గడ్కరీ, కుమారస్వామి, చంద్రబాబు, నితీశ్ కుమార్ తదితర ఎన్డీఎ నేతలు బలపరిచారు. ఈ సమావేశానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ ప్రతిపాదన కు నూతన ఎంపీలు అందరూ ఆమోదం తెలిపారు. దీంతో మూడోసారి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టేందుకు మార్గం సుగుమమైంది. ఈ ప్రతిపాదనను ఎన్‌డిఎ నేతలు రాష్ట్రపతి ముర్ముకు అందచేస్తారు. ఈ నెల 9న సాయంత్రం 6 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో మోడీ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుంది. ఈ సందర్భంగా చంద్ర బాబు మాట్లాడుతూ మోడీని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. నరేంద్ర మోడీ అంతర్జాతీయంగా దేశానికి ప్రతిష్ట తీసుకొచ్చారని అన్నా రు చంద్రబాబు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద

మిగతా 2 లో

### ఎన్‌డీఏ అంటేనే సుపరిపాలన

- భారత్ స్ఫూర్తిని నిలిపిన కూటమి ఇది
- ఇది విజయవంతమైన భాగస్వామ్యం
- పేదల సంక్షేమమే మనందరి కర్తవ్యం
- ఎన్‌డీఏ భేటీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన



## రాష్ట్రపతి ముర్ముతో మోడీ భేటీ

- ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించాలని వినతి
- ఆదివారం నాటి ప్రమాణానికి రాష్ట్రపతి ఆమోదం
- ముచ్చటగా మూడోసారి ప్రమాణానికి మోడీ సిద్ధం
- మంత్రివర్గ కూర్పుపై సీనియర్లతో కసరత్తు
- కార్యక్రమానికి హాజరు కానున్న విదేశీ ప్రతినిధులు



## యుద్ధ ప్రాతిపదికన పార్వతి బ్యారేజ్ పునరుద్ధరణ పనులు

- ప్రతి పనికి నిర్దిష్ట సమయం నిర్దేశించుకోవాలి
- డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం బ్యారేజ్ పునరుద్ధరణ
- బ్యారేజ్ వల్ల వచ్చే సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు
- నిర్మాణ సంస్థలకు మంత్రి ఉత్తమ్ కుమార్ ఆదేశం
- అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల పరిశీలన
- 94 వేల కోట్లతో కట్టినా పనికిరాకుండా పోయిందన్న ఉత్తమ్

**కరీంనగర్, ప్రజానావ:** కాళేశ్వరం ప్రాజెక్టు దెబ్బ తిన్న చోట్ల మరమ్మతు పనులను వేగ వంతం చేయాలని నిర్మాణ సంస్థలను మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీల పరిశీలనకు మంత్రి ఉత్తమ్ వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ వల్ల కాళేశ్వరంపై రివ్యూ జరగలేదు. భారాస హయాంలోనే మేడిగడ్డ కుంగింది. రూ.94 వేల కోట్లు అప్పు చేసి కట్టిన ప్రాజెక్టు కుం గిపోతే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దానికి వడ్డీ కట్టాల్సి వస్తోంది. కాంగ్రెస్ అధికారం లోకి రాగానే నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ ని సంప్రదించి పరిశీలన చేయమని కోరాం. నిపుణుల కమిటీ కొన్ని సూచనలు చేసింది. మేడిగడ్డ కుంగిన

మిగతా 2 లో



## ఖజానా లోటుపై ప్రభుత్వం సమీక్ష

- ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి
- ఎల్ఆర్ఎస్ క్లీయర్ చేయాలని నిర్ణయం

**హైదరాబాద్ బ్యూరో, ప్రజానావ:** ఖజానా లోటుపై ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఆదాయ మార్గాలపై అన్వేషణ చేపట్టింది. ఆదాయం పెంచుకుంటే తప్ప అప్పులకు వడ్డీలు కట్టలేని దుస్థితి ఏర్పడింది. ఈ క్రమంలో వివిధ శాఖల అధికారులతో డిప్యూటి సీఎం

మిగతా 2 లో



## ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో తీన్మార్ మల్లన్న విజయం

**నల్గొండ, ప్రజానావ:** నల్గొండ– వరంగల్– ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ గెలుపొందారు. మూడు రోజులుగా సాగిన కౌంటింగ్ ప్రక్రియలో.. మొదటి ప్రాధాన్యత, రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో బీజేపీ అభ్యర్థితో పాటు 43 మంది అభ్యర్థులు ఎలిమినేట్ అయ్యారు. చివరకు బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి కూడా ఎలిమినేట్ కావడంతో తీన్మార్ మలనాన్న విజయం సాధించారు. రెండో ప్రధాన్యత ఓటులో మల్లన్నకు రాకేశ్ రెడ్డి గట్టి పోటీ ఇచ్చారు. అయితే, ముందు నుంచీ తీన్మార్ మల్లన్న ఆధిక్యం చూపించారు. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి ఏ రౌండ్‌లోనూ పోటీ ఇవ్వలేకపోయారు. చివరకు రాకేశ్ రెడ్డి ఎలిమినేషన్ కావడంతోనే తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయమైంది. ఈ మేరకు ఎన్నికల అధికారి ప్రకటన చేశారు.



## పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

2 లో..

బెయిల్ మంజూరు చేసిన కర్నాటక కోర్టు



## సీడబ్ల్యూసీ భేటీ కోసం ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్

2 లో..

రాష్ట్ర వ్యవహారాలపై కాంగ్రెస్ పెద్దలతో సమాలోచన

## ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ విడుదల


2 లో..



## నేటినుంచి మృగశిర కార్తె

3 లో..

చేపమందు పంపిణీకి ఏర్పాట్లు



## డేటింగ్ యాప్‌తో యువకులకు మస్కా

- పబ్ యజామానులతో కలిసి యువతుల మోసం
- ఓ యువకుడికి గంటలో 40 వేల బిల్లు వేయించి పరార్

3 లో..



# రాష్ట్రపతి ముర్ముతో మోదీ భేటీ

**న్యూఢిల్లీ, జూన్ 7 :** ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం ప్రధానిగా ప్రమాణం చేయనున్నారు. వరుసగా మూడోసారి ఆయన ప్రధాని బాధ్యతలు చేపట్టబోతున్నారు. ఎన్డీఏ భేటీ తర్వాత శుక్రవారం సాయంత్రం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మోదీ కలిశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా తనను లోక్‌సభ పక్షనేతగా ఎన్డీయే మిత్రపక్షాలు ఎన్నుకున్న తీర్మానాన్ని రాష్ట్రపతికి అందజేశారు. మోదీ వెంట ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు ఉన్నారు. తమ కూటమికి మద్దతు ఇస్తోన్న పార్టీల లేఖలు, కొత్తగా ఎంపికైన మొత్తం ఎంపీల జాబితాను రాష్ట్రపతికి మోదీ అందించారు. ఈ క్రమంలో కేంద్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని మోదీని రాష్ట్రపతి ఆహ్వానించారు. మోదీకి రాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు ఓ జ్ఞాపికను బహూకరించారు. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారని.. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తామని మోదీ అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతికి అందించామని.. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరినట్లు చెప్పారు. ఈ నెల 9న ఆదివారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు రాష్ట్రపతికి తెలియజేశామని వెల్లడించారు. ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో ఎన్డీయే కూటమి నేతలు శుక్రవారం ఉదయం కీలక సమావేశం నిర్వహించారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, జేడీయూ చీఫ్ నితీశ్ కుమార్,ఏక్‌నాథ్ షిండే, చిరాగ్ పాశ్వాన్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజ్ నాథ్ సింగ్ ఎన్డీయే పక్షనేతగా మోదీని ప్రతిపాదించగా ఎంపీలంతా ఆమోదించారు. ఈ క్రమంలో ఆయన మూడోసారి ప్రధానిగా ఈ నెల 9న కర్తవ్యపథ్‌లో ప్రమాణం చేయనున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మోదీ బాధ్యతలు చేపట్టేలా ముహూర్తం ఖరారు చేశారు. ఆ రోజు ప్రధానితో పాటు కొందరు మంత్రులు కూడా ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతిచ్చే ఎంపీల జాబితాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు అందజేశామని ప్రధాని మోదీ తెలిపారు. ఆజాదీ కా అమృత్ ఉత్సవాల తర్వాత జరిగిన మొదటి ఎన్నికలు ఇవి. దేశానికి మరింత సేవ చేయాలని ప్రజలు మమ్మల్ని ఆశీర్వదించారు. దేశ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ముందుకెళ్తాం. ప్రజల ఆకాంక్షలు మేరకు మరింత ఉత్సాహంగా పని చేస్తాం. ఇవాళ ఉదయమే ఎన్డీయే నేతలంతా కలిసి చర్చించాం. ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించాలని రాష్ట్రపతిని కోరాం. ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తామని రాష్ట్రపతికి తెలియజేశాం అని మోదీ తెలిపారు. మోదీ ప్రమాణ స్వీకార ఈ కార్యక్రమానికి రావాలని పలువురు దక్షిణాసియా నేతలకు ఆహ్వానాలు అందాయి. మాల్దీవ్స్ ప్రెసిడెంట్ మహమ్మద్ ముయిజ్జును కూడా పిలిచారు. ముయిజ్జు మోదీకి అభినందనలు కూడా తెలిపారు. ఆయన ఆ ఆహ్వానాన్ని స్వీకరించారు. గత కొంత కాలంగా ముయిజ్జు చైనా దేశానికి అనుకూలంగా పని చేస్తూ.. భారత్ కు వ్యతిరేకంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఇరు దేశాల మధ్య దౌత్య సంబంధాలు కూడా దూరమవుతున్నట్లు కనిపిస్తుంది. శ్రీలంక, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, మారిషస్ దేశాల నేతలకు ప్రమాణస్వీకారానికి రావాల్సిందిగా ఆహ్వానాలు అందాయి. ప్రమాణ స్వీకారోత్సవానికి మోదీ ఆయనను ఆహ్వానించినట్లు శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే కార్యాలయ మీడియా విభాగం తెలిపింది. విక్రమసింఘే ఆహ్వానాన్ని అంగీకరించారని, మోదీకి అభినందనలు తెలిపారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, నేపాల్ నేత పుష్ప కమల్ దహల్ ప్రచండ కూడా వేడుకకు హాజరు కావాల్సిందిగా కోరారు.

# ఖజానా లోటుపై ప్రభుత్వం సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

మల్లు భట్టి విక్రమార్క సమీక్షించారు. మంత్రులు పొంగులేటి, పొన్న ప్రభాకర్‌లు కూడా ఇందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్‌పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ఈ పక్రియ ప్రారంభమైందని, సంబంధిత దరఖాస్తులను పూర్తి చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని ప్రశ్నించారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ముందే ఒఖా దరఖాస్తులు పూర్తిచేయకపోవడానికి గల కారణాలపై సమీక్షించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.ఈ పక్రియను త్వరగా పూర్తి చేసి ఖజానాకు అదనపు ఆదాయం సమకూర్చాలని కోరారు. పూర్తిగా అర్హత ఉన్న స్థలాలకే ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం అమలు చేయాలని, ప్రభుత్వ భూములు కబ్జా చేసి ఈ పథకం కింద ప్రయోజనం పొందే ప్రమాదం పొంచి ఉందని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఆదాయం పెంచే మార్గాలు అన్వేషించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా, ఆరోగ్యశ్రీ విభాగాల పనితీరును సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. సమీక్షలో భాగంగా గత రెండు నెలల ఆర్థిక ప్రగతిని సమీక్షించారు. ఆ తర్వాత బ్జడెట్ అంచనాలకు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరంలోని మొదటి రెండు నెలలు కనబరిచిన పనితీరును సమీక్షించి ఆయా శాఖల్లో పనితీరు మెరుగుపరచుకోవడానికి యంత్రాంగాన్ని సిద్ధం చేసుకుని ఎలాంటి లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్ట పరిచి బ్జడెట్ అంచనాలను అందుకోవాలని వివరించారు. ఆదాయం పెంచుకునేందుకు వాణిజ్య పన్నుల శాఖలో వేసిన కమిటీ పనితీరును డిప్యూటీ సీఎం భట్టి అడిగి తెలుసుకున్నారు. ఆదాయం పెంచుకునేందుకు కమర్షియల్ టాక్స్ విభాగాల్లో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ ప్రస్తుతం వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేటును సమీక్ష చేసుకొని, తక్కువ వడ్డీ రేటు ఇచ్చే సంస్థలకు రుణాలు బదలాయింపు చేసుకుని ఆదాయం పెంచుకునే మార్గాలు అన్వేషించాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఇటీవల సింగరేణిలో చేసిన ఈ ప్రయోగం ద్వారా వందల కోట్ల ప్రయోజనం చేకూరిన విషయాన్ని ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులకు వివరించారు. హౌసింగ్ బోర్డ్, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా నిర్మించిన ఇల్లు, వచ్చిన ఆదాయం వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ విక్రయించని ఇల్లు, ఇళ్ల స్థలాలు వాటి పరిస్థితిని సమీక్షించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్యుడు సంతృప్తి చెందడమే ప్రధాన లక్ష్యమని అధికారులకు సూచించారు. ఆరోగ్యశ్రీ బకాయిలను నెలవారి చెల్లించే పద్ధతిని ఆచరణలో పెడుతున్నట్టు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో అమలు చేస్తున్న ప్యాకేజీల ధరలకే ప్రైవేటు ఆస్పత్రిలో ఆయా చికిత్సలు అందించేందుకు వారిని ఒప్పించాలని, ఈ పథకం సామాజిక బాధ్యతలో భాగమని వారికి వివరించాలని, వారితో చర్చలు జరపాలని డిప్యూటీ సీఎం అధికారులను కోరారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమర్షియల్ టాక్స్ కమిషనర్ శ్రీదేవి, రవాణా శాఖ కమిషనర్ బుద్ధ ప్రసాద్, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

# సీడబ్ల్యూసీ భేటీ కోసం ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్


**హైదరాబాద్, ప్రజానావ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లారు. శనివారం దిల్లీలో జరిగే సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన పాల్గొ నసున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ పెద్దలతో సీఎం సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు మంత్రివర్గ విస్తరణ జరగలేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియడంతో ఈ అంశంపై చర్చించే అవకా శం ఉంది. అలాగే నామినేటెడ్ పోస్టుల భర్తీ, పీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపిక తదితర విషయాలపై చర్చిస్తారని సమాచారం. సీడబ్ల్యూసీ సమావేశంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ కూడా పాల్గొనను న్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు వంశీచంద్ రెడ్డి, దామోదర్ రాజనర్సింహ హాజరు కానున్నారు.

# ఎన్‌డీఏ పక్షనేతగా మోడీ ఏకగ్రీవ ఎన్నిక

(మొదటిపేజీ తరువాయి)

ఆర్థిక వ్యవస్థకు మోడీ నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. మోడీ నేతృత్వంలో భారత్ అగ్రదేశంగా ఎదుగుతుందని అన్నారు. ఏం సాధించాలన్న విజన్ కావాలని, మోడీ విజన్ ఉన్న నాయకుడని అన్నారు. భారత్ అగ్రదేశంగా ఎదగటానికి ఇది గొప్ప అవకాశం ఉందని అన్నారు. మొదటి నుండి ఎన్డీయేతో టీడీపీకి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. తనకు ఏ ఇజాలు తెలియవని, మానవత్వమే తన ఇజం అని ఎన్టీఆర్ అన్నారని గుర్తు చేశారు. తన జీవితంలోనే ఇదొక గొప్ప సందర్భమని అన్నారు. ఎన్నికల సమయంలో కీలక ప్రచార సభల కోసం మోడీ వచ్చారని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంపై తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. భారత్‌కు సరైన సమయంలో సరైన నాయకుడు దొరికారని, ఆయన నరేంద్ర మోదీ అని చంద్రబాబు పొగిడారు. నరేంద్ర మోదీకి విజన్, ఉత్సాహం ఉన్నాయని, పరిపూర్ణ కార్యదక్షత కలిగిన నాయకుడని అన్నారు. తన విధానాలన్నింటినీ నిజమైన స్ఫూర్తితో అమలు చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం భారత్‌కు చాలా మంచి అవకాశమని, ఇప్పుడు మిస్ అయితే ఎప్పటికీ నష్టపోతామని చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ఎన్డీయేను అధికారంలోకి తీసుకురావడానికి మోదీ రేయింబవళ్లు కష్టపడ్డారు. ఎన్డీఏ అద్భుత మెజారిటీ సాధించింది. ఎంతోమంది నేతలను చూశాను కానీ మోదీ లాంటి పవర్‌ఫుల్ నేతలను ఎక్కడా చూడలేదు. ఏపీలో మోదీ కీలక ప్రచార సభలకు హాజరయ్యారు. మేకిన్ ఇండియా విజన్‌తో దేశాన్ని ముందుండి నడిపించారు. మోదీ విజన్ వల్లే దేశం అభివృద్ధిలో దూసుకుపోతోంది. అంతర్జాతీయ స్థాయిలోనూ భారత్ పేరు ప్రఖ్యాతులను మోదీ ఇనుమడింపజేశారు' అని చంద్రబాబు ప్రశంసించారు. మోదీ విజన్, సమర్థత దేశానికి ఎంతో అవసరని ఈ సందర్భంగా చంద్రబాబు వ్యాఖ్యానించారు. దేశానికి మోదీ ఎన్నో అద్భుత విజయాలు అందించారని, దేశంలో యువశక్తి ఐటీ రంగంలో దూసుకుపోతోందని ప్రస్తావించారు.

ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థకు మోదీ నాయకత్వం వహిస్తున్నా రని, ఏం సాధించాలన్నా ఒక విజన్ ఉండాలని, మోదీ విజన్ ఉన్న నాయకుడని చంద్రబాబు మెచ్చుకున్నారు. ఇక లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన నూతన ఎంపీలు అందరినీ ఆయన అభినందించారు.



# ఎన్‌డీఏ అంటేనే సుపరిపాలన

- **భారత్ స్ఫూర్తిని నిలిపిన కూటమి ఇది**
- **పేదల సంక్షేమమే మనందరి కర్తవ్యం**
- **ఎన్‌డీఏ భేటీలో ప్రధాని మోడీ ఉద్ఘాటన**

**న్యూఢిల్లీ, జూన్ 7 :** ఎన్‌డీఏ అంటేనే సుపరిపాలన. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. మనది అత్యంత విజయవంతమైన భాగస్వామ్యం' అని నరేంద్ర మోదీ అన్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం దిల్లీలో శుక్రవారం జరిగింది. ఇందులో తమ లోక్‌సభా పక్ష నేతగా మోదీని ఎన్డీయే నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లలో ఈ కూటమి దేశాన్ని మూడుసార్లు ఐదేళ్లు పాలించింది. మరోసారి ఐదేళ్ల పాలనకు ప్రజలకు అవకాశమిచ్చారు. దేశం కోసం నిబద్ధత కలిగిన బృందం ఇది. ఎన్డీయే అంటేనే సుపరిపాలన. పేదల సంక్షేమమే మనందరి ప్రథమ కర్తవ్యం. దేశ అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించాం. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసి తీరుతాం. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్న కూటమి ఇంతగా ఎప్పుడూ విజయవంతం కాలేదు. ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే సంఖ్యా బలం అవసరం. దేశాన్ని నడపాలంటే సర్వసమ్మతం కావాలి. కూటమిలో పరస్పర విశ్వాసమే ప్రధానం. అన్ని అంశాల్లో ఏకగ్రీవ నిర్ణయాలే లక్ష్యం' అని మోదీ అన్నారు. 'న్యూ ఇండియా, డెవలప్‌డ్ ఇండి యా, ఆస్పిరేషనల్ ఇండియా' అని కొత్త అర్థం చెప్పారు. దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు. కర్ణాటక, తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లోని ప్రజలు భాజపాకు అండగా నిలిచారు. తమిళనాడులో సీట్లు గెలవలేకపోయినా ఓట్లు పెరిగాయి. కేరళలోనూ మా కార్యకర్తలు ఎన్నో బలిదానాలు చేశారు. తొలిసారి అక్కడి నుంచి మా ప్రతినిధి సభలో అడుగుపెడుతున్నారు. అరుణాచల్, సిక్కింలో క్లీన్‌స్వీప్ చేశాం. ఏపీ ప్రజలు కూటమికి పెద్ద ఎత్తున మద్దతిచ్చారు. చంద్రబాబుతో కలిసి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నాం. ఏపీలో ఇంత భారీ విజయం ప్రజల ఆకాంక్షలను అద్దం పట్టిందని మోదీ కొనియాడారు. ఎన్నికల్లో ఎన్డీయే ఘన విజయం సాధించింది. అయినా కూడా విపక్షాలు మన విజయాన్ని తిరస్కరించేందుకు ప్రయత్నించాయి. మనం ఓడిపోయామని చిత్రీకరించాలని చూశాయి. కానీ, మనకు ఓటమి లేదని దేశ ప్రజలకు తెలుసు. ఎన్నికల ముందు ఈవీఎంలను కొందరు సందేహించారు. ఫలితాల తర్వాత అవన్నీ పటాపంచలయ్యాయి. ఇకనైనా విపక్షాలు పార్లమెంట్‌లోకి వచ్చి చర్చల్లో పాల్గొంటాయని భావిస్తున్నానని మోదీ చురకలంటించారు.

# యుద్ధ ప్రాతిపదికన పార్వతి బ్యారేజ్ పునరుద్ధరణ పనులు

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే గేట్లు ఎత్తి ఉంటే ఇంత డ్యామేజీ జరిగేది కాదని తేల్చింది. దెబ్బతిన్న చోట్ల కొన్ని రిపేర్లు చేసి అన్నారం, మేడిగడ్డ, సుందిళ్ల మూడు బ్యారేజీల గేట్లు ఎత్తిపెట్టాలని చెప్పింది. ఆ పనుల పరిశీలన చేయడానికి వచ్చా. మేడిగడ్డ, అన్నారం వద్ద పనులు వేగంగా జరుగుతున్నాయి. సుందిళ్ల బ్యారేజీ పనులు నెమ్మదిగా జరుగుతుండటంతో వేగవంతం చేయాలని చెప్పాం. వర్షాలకు ముందే పనులు పూర్తి కావాలని నిర్మాణ సంస్థలను ఆదేశించాం. తుమ్మడి హట్టి వద్ద ఆనకట్ట నిర్మిస్తాం అని ఉత్తమ్ చెప్పారు. రిపేర్లు చేసినా బ్యారేజీల గేట్లు ఎత్తాల్సిందే నన్నారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. కాళేశ్వరంలోని బ్యారేజీలను పరిశీలించిన ఉత్తమ్.. ఎన్డీఎస్ఏ సూచనల మేరకే మరమ్మతులు చేస్తున్నట్లు చెప్పారు. నిపుణుల కమిటీ సూచనలు ఇచ్చే వరకు గేట్లు ఓపెన్ చేస్తామని చెప్పారు. కేసీఆరేమో నీళ్లు స్టోరేజ్ చేయొచ్చని ప్రచారం చేస్తున్నారు.. ఎన్డీఎస్ఏ వద్దంటోందని అన్నారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజ్ లో పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు ఉత్తమ్. సుందిళ్లలో నవయుగ కంపెనీ పనుల్లో ఆలస్యంగా జరుగుతున్నాయన్నారు. పనులు వేగవంతం చేయాలని నవయుగ కంపెనీ ప్రతినిధులను హెచ్చరించామన్నారు. కాంట్రాక్టు నిర్మాణ సంస్థల ఖర్చుతోనే ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు జరుగుతున్నాయని చెప్పారు. ఎల్లంపల్లికి నీటిని ఎత్తిపోయవచ్చని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలోనే మేడిగడ్డ కుంగిందన్నారు. పాలమూరు రంగారెడ్డికి 20 వేల కోట్లు ఖర్చు పెట్టి ఎకరాకు నీళ్ళియ్యలేదన్నారు. ఎన్నికల కోడ్ ఉండటంతో కాళేశ్వరం ప్రాజెక్టుపై రివ్యూ చేయలేదన్నారు ఉత్తమ్. కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉంది.. 90వేల కోట్లకు వడ్డీ చెల్లిస్తున్నామని చెప్పారు. సుందిళ్ళ బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను, గుత్తేదారు ఏజెన్సీలను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మించిన మూడు బ్యారేజ్ ల సందర్శనలో భాగంగా శుక్రవారం తొలుత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంథని మండలం సిరిపురం గ్రామం వద్ద నిర్మించిన సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను సందర్శించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ ను ఆసాంతం మంత్రి పరిశీలించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అందించిన సూచనల ప్రకారం మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు వేగవంతంగా పూర్తి కావాలని, క్షేత్రస్థాయిలో పనుల పురోగతిలో ఆశించిన మేర ఫలితం కనపడటం లేదని, అవసరమైన మేర అదనపు బృందాలను ఏర్పాటు చేసి పనులు వేగవంతం చేయాలని మంత్రి అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. బ్యారేజ్ పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహించాలని, ప్రతి పనికి సంబంధించి నిర్దేశిత సమయాన్ని నిర్దేశించుకొని దానిలోపు ఆ పని పూర్తి చేసే విధంగా ఏజెన్సీలు పనిచేయాలని, ఏ పని ఎప్పటి వరకు పూర్తవుతుందో కాగితంపై షెడ్యూల్ రూపొందించి అందించాలని మంత్రి ఆదేశించారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ సమీపంలో గల పంప్ హౌస్ సంరక్షణ కోసం నిర్మిస్తున్న కట్ట వల్ల స్థానికులకు కలిగే నష్టాన్ని స్థానిక మంత్రివర్యులతో కలిసి అంచనా వేసి వాటి పరిష్కార మార్గాలను సూచిస్తూ ప్రతిపాదనలు సమర్పించాలని మంత్రి సంబంధిత ఇంజనీరింగ్ అధికారిని ఆదేశించారు. ప్రాజెక్టు ఈ.ఎన్.సి అనిల్ కుమార్ జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల ప్రకారం క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పనుల వివరాలను మంత్రికి వివరించారు. రాబోయే వానా కాలంలో మూడు బ్యారేజీల సంరక్షణకు, తదుపరి ఎటువం టి డ్యామేజీ జరగకుండా పనులు చేపట్టామని ఈఎన్సీ తెలిపారు. సుందిళ్ల (పార్వతి) బ్యారేజ్ వద్ద కొట్టుకుపోయి న ఇసుక పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటున్నామని , జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల ప్రకారం జియో ఫిజికల్, జియో టెక్నికల్ జనరల్ పరీక్షలు నిర్వహించి కొట్టుకుపోయిన ఇసుకను అంచనా వేసి వాటిని పునరుద్ధరించి బ్యారేజ్ ఎటువంటి మరమ్మత్తుకు గురికాకుండా సంరక్షణ చర్యలు చేపడుతున్నామని, మంత్రి ఆదేశాల మేరకు పనులను క్షేత్రస్థాయిలో వేగవంతం చేసి రాబోయే పది రోజుల్లో పునరుద్ధరణ పనులు పూర్తి చేస్తామని ఈఎన్సీ అన్నారు. అనంతరం మీడియాతో రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయినప్పటికి నిర్లక్ష్యం వహిస్తూ ఎటువంటి మరమ్మత్తులు చేపట్టలేదని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 3 బ్యారేజీల పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని, దేశంలోనే పార్లమెంట్ ద్వారా ఏర్పాటు చేసిన అత్యున్నత సంస్థ అయిన జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీలకు బాధ్యత అప్పగించడం జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించేందుకు తమ ప్రభుత్వం సుప్రీంకోర్టు మాజీ జడ్జ్ జస్టిస్ ఆధ్వర్యంలో వేసిన జ్యుడీషియల్ కమిషన్ సైతం ప్రాజెక్టును సందర్శిస్తుందని మంత్రి అన్నారు.

# పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

## బెయిల్ మంజూరు చేసిన కర్నాటక కోర్టు

**బెంగళూరు, జూన్ 7 :** 'పరువునష్టం కలిగించే' ప్రకటనలు వేయించినందుకు బిజెపి కర్నాటక శాఖ దాఖలు చేసిన కేసు సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి బెంగళూరులోని ప్రత్యేక కోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. కర్నాటక అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రచురించిన ప్రకటనల్లో రాష్ట్రంలోని అప్పటి బిజెపి ప్రభుత్వం తన 2019- 2023 పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. పరువు నష్టం కేసు సందర్భంగా కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్ ఈ నెల 1న కోర్టుకు హాజరైనప్పుడు వారికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల 7న కోర్టుకు తప్పనిసరిగా హాజరు కావాలని రాహుల్ గాంధీని న్యాయమూర్తి కెఎన్ శివకుమార్ ఆ రోజు ఆదేశించారు. గత రెండు విచారణలకు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు కోరినందుకు రాహుల్ గాంధీ శుక్రవారం క్షమాపణ తెలియజేశారు. కోర్టు ఆయన క్షమాపణను అంగీకరించి రూ. 75 లక్షల ష్యూరిటీతో బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీతో పాటు సిద్ధరామయ్య, శివకుమార్ కూడా కోర్టుకు హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కర్నాటకలోని అన్ని ప్రధాన స్రవంతి దినపత్రికల్లో నిరుడు మే 5న నిందితులు 'అవినీతి రేటు కార్డు', '40 శాతం కమిషన్ సర్కార్' శీర్షిక కింద జారీ చేసిన ప్రకటనల్లో తప్పుడు, నిర్లక్షపూరిత ఆరోపణలు చేశారని నిరుడు జూన్‌లో దాఖలు చేసిన ఫిర్యాదులో బిజెపి ఆరోపించింది. కెపిసిసి అధ్యక్ష హోదాలో శివకుమార్, శాసనసభలో అప్పటి ప్రతిపక్ష నాయకుని హోదాలో సిద్ధరామయ్య ద్వారా కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (కెపిసిసి) ఆ ప్రకటనలు జారీ చేసిందని బిజెపి తన ఫిర్యాదులో ఆరోపించింది. రాహుల్ గాంధీ ఆ 'పరువునష్టం కలిగించే ప్రకటన'ను తన సామాజిక మాధ్యమం 'ఎక్స్' పోస్ట్‌లో పొందుపరిచారని బిజెపి పేర్కొన్నది. రాహుల్ గాంధీ స్వయంగా కోర్టు ముందు హాజరైన తరువాత బిజెపి 'ఎక్స్' పోస్ట్‌లో వ్యాఖ్యానిస్తూ, 'నేషనల్ హెరాల్డ్ కేసులో బెయిల్‌పై విడుదలైన నిందితుడు రాహుల్ గాంధీ ! నమ్మ బెంగళూరుకు మీకు పలుకుతున్నాం' అని పేర్కొన్నది.


# ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్, ప్రజానావ :** ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. ఈ నెల 8 నుంచి ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల పక్రియ ప్రారంభం కానుంది. పదవీ విరమణకు 3 ఏండ్ల లోపు ఉన్న వారికి తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. మల్టీ జోన్ 1లో శనివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు, మల్టీ జోన్ 2లో రేపట్నుంచి ఈ నెల 30 వరకు బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. కోర్టు కేసులతో గతంలో ఎక్కడ పక్రియ ఆగిపోయిందో అక్కడి నుంచి బదిలీల పక్రియ ప్రారంభం కానుంది. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయుల పదోన్నతుల పక్రియ జరగనుంది.

# నేటినుంచి మృగశిర కార్తె

## చేపమందు పంపిణీకి ఏర్పాట్లు

**హైదరాబాద్, ప్రజానావ :** హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మృగశిర కార్తెను పురస్కరించుకుని శని,ఆదివారాల్లో రెండ్రోజుల పాటుచేప ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నారు. ఇందుకుగాను అధికారులు తగిన ఏర్పాట్లు చేసారు. మత్స్యశాఖ అవసరమైన చేప పిల్లలను సమకూరుస్తుండగా, దూర ప్రాంతం నుంచి వచ్చే వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు తెలంగాణ ఆర్టీసీ అదనంగా 130 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. చేప ప్రసాదం కోసం నగరానికి వచ్చేవారు ఇబ్బందులు పడకుండా వివిధ ప్రాంతాల నుంచి నేరుగా నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కు బస్సులు నడుపుతోంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ రైల్వే స్టేషన్, జేబీఎస్, ఈసీఐఎల్, ఈసీఐఎల్ క్రాస్‌రోడ్స్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, దిల్‌సుఖ్‌నగర్, ఎన్జీవోస్ కాలనీ, మిథాని, ఉప్పల్, చార్మినార్, గోల్కొండ, రాంనగర్, రాజేంద్రనగర్, రిసాల బజార్, పటాన్‌చెరు, జీడిమెట్ల, కేపీహెచ్‌బీ, గచ్చిబౌలి నుంచి ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి.




# డేటింగ్ యాప్‌తో యువకులకు మస్కా

- పబ్ యజామానులతో కలిసి యువతుల మోసం
- ఓ యువకుడికి గంటలో 40 వేల బిల్లు వేయించి పరార్

**ఖైరతాబాద్, ప్రజానావ:** డేటింగ్ యాప్‌తో పరిచయం పెంచుకుని నయా మోసాలకు తెగబడుతున్నారు. ఇదంతా యువతి, పబ్ యజమానులు కలిసి ఆడుతున్న నాటకంగా గుర్తించారు. ఓ డేటింగ్ యాప్‌లో పరిచయమవుతున్న యువతులు.. హైటెక్ సిటీలోని ఓ పబ్‌కి యువకులను తీసుకెళ్లి వేలకువేలు బిల్లు చేసి ఉడాయిస్తున్నారు. ఇలా యువ బిజినెస్ మేన్‌కు తగులుకున్న రితిక అనే యువతి గంటలో రూ.40 వేల బిల్లు చేసి కని పించకుండా జారుకుంది. ఆ పబ్ వాళ్లు ఆ డబ్బంతా కట్టాలంటూ యువకులపై ఒత్తిడి తెస్తున్నారు?! ఇప్పటివరకూ 8మంది బాధితులు వెలుగులోకి వచ్చారు..! టిండర్, బంబుల్ అనే డేటింగ్ స్కాం నగరంలో వెలుగుచూసింది. ఈ యాప్ ద్వారా పరిచయమవుతున్న యువతులు.. వెంటనే కలుద్దాం అంటూ.. వాట్సాప్ ద్వారా యువకులకు మెసేజ్ పెడుతున్నారు. ఆ యువకులను హైటెక్ సిటీలోని ఓ పబ్‌కి తీసుకెళుతున్నారు. ఆ పబ్‌లో ఖరీదైన మద్యం, ఇతర ఆహార పదార్థాలు ఆర్డర్ చేసి యువతులు కనిపించకుండా నెమ్మదిగా జారుకుంటున్నారు. గంటలో రూ.40వేల బిల్లు చూసి యువకులు ఖంగుతింటున్నారు. ఆ డబ్బంతా కట్టాలంటూ పబ్ నిర్వాహకులు ఆ యువకులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికి 8మంది బాధితులుగా మారినట్లు తెలుస్తుంది. అయితే పబ్ నిర్వాహకులు, యువతులు కలిసి ఈ స్కాంకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. తాము కూడా బాధితులమేనంటూ పలువురు ముందుకు వస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకూ పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

# మోడీ నాయకత్వానికి జనసేన మద్దతు

- దేశానికి మోదీ ఒక స్ఫూర్తి అంటూ పవన్ కితాబు
- పవన్ తుఫాన్ అంటూ మోడీ ప్రశంసలు



**న్యూఢిల్లీ, జూన్ 7 :** దేశానికి మోదీ ఒక స్ఫూర్తి అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. పార్లమెంటు సెంట్రల్ హాలులో జరిగిన ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పవన్ మాట్లాడుతూ.. మోదీ ఎంతోమందికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మోదీ స్ఫూర్తితో ఏపీలో అద్భుత విజయం సాధించామన్నారు. మోదీ వెనుక తామంతా ఉన్నామని ప్రకటించారు. ఎన్డీఏ పక్ష నేతగా మోదీకి తమ పూర్తి మద్దతును పవన్ తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వానికి జనసేన పార్టీ మద్దతిస్తుందని పవన్‌కల్యాణ్ అన్నారు. విజనరీ నాయకుల బాటలో పయనించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 'జనసేన తరఫున మోదీకి హృదయపూర్వక శుభాకాంక్షలు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఆయన స్ఫూర్తిగా నిలిచారు. మోదీ ప్రధానిగా ఉన్నంత వరకు ఏ దేశానికీ భారత్ తలొగ్గదు. మీ నేతృత్వంలో పని చేయడాన్ని గర్వంగా భావిస్తున్నాం' అని పవన్ కల్యాణ్ అన్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు కురిపించారు. ఇక్కడ కూర్చున్న వ్యక్తి పవన్ కాదు తుపాను అని ప్రత్యేకంగా అభినందించారు. దక్షిణాది రాష్ట్రాల గురించి ప్రస్తావించిన సందర్భంగా ఏపీ నేతలను కొనియాడారు. పాత పార్లమెంట్ భవనంలో ఎన్డీయే ఎంపీల సమావేశం జరిగింది. కూటమి లోక్‌సభా పక్షనేతగా మోదీ పేరును భాజపా నేతలు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. భాగస్వామ్య పార్టీలు దీనికి మద్దతు పలుకుతూ మోదీని ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ప్రకటించాయి. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఏపీలో దక్కిన విజయం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందన్నారు. చంద్రబాబుతో కలిసి చరిత్రాత్మక విజయం సాధించామన్న ఆయన..ఆ సమావేశంలోనే ఉన్న పవన్‌ను అభినందించారు.

# నీట్ ఫలితాల్లో అవకతవకలు

- వెంటనే విచారణకు ఆదేశించాలి
- కాంగ్రెస్ కార్యదర్శి ప్రియాంక డిమాండ్



**న్యూఢిల్లీ, జూన్ 7 :** నీట్-2024 ఫలితాల్లో అవకతవకలు చోటుచేసుకున్నాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. దీనిపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలుత నీట్ ప్రశ్నాపత్రం లీకైందన్న ఆమె... ఇప్పుడు ఫలితాల్లోనూ కుంభకోణం జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. ఈమేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు ఆమె చెప్పారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మరోవైపు నీట్ ఫలితాల వెల్లడి తర్వాత పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతుండటంపై ప్రియాంక దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాట మాడుతోందని విమర్శించారు. 'లక్షలాది మంది విద్యార్థుల గోడును ఈ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోంది. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పదేపదే మొత్తుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. దర్యాప్తు చేపట్టి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా?' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. నీట్ పరీక్ష ఫలితాలపై పలువురు అభ్యర్థులు, తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. జూన్ 4న వెలువడిన నీట్ ఫలితాల్లో దేశవ్యాప్తంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్ వచ్చింది. అందులో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు రావడం గమనార్హం. మరోవైపు నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు వార్తలు గుప్పుమన్నాయి. అయితే, దీనిని తప్పుడు ప్రచారంగా ఎన్‌టీఏ కొట్టి పారేసింది. మే 5న సాయంత్రం 4 గంటల సమయంలో ప్రశ్నపత్రం ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, ఆ సమయానికే దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో పరీక్ష మొదలైపోయిందని, అందువల్ల ప్రశ్నపత్రం లీక్ కాలేదని క్లారిటీ ఇచ్చింది.

## పోలీసుల భయంతో భవనం పైనుంచి దూకిన వ్యక్తి

### చికిత్స పొందుతూ మృతి

**హైదరాబాద్, ప్రజానావ:** పోలీసులను చూసి భయంతో పారిపోయే క్రమంలో భవనంపై నుంచి దూకి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని లాలాపేట్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం రాత్రి పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. భయాందోళనకు గురైన పేకాట రాయుళ్లు అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ క్రమంలో వినయ్ (35) అనే వ్యక్తి మూడంతస్తుల భవనం పైనుంచి కిందికి దూకాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

## ప్రజావాణి పునఃప్రారంభం

### ఆర్జీలు ఇచ్చేందుకు వచ్చిన జనం

**హైదరాబాద్, ప్రజానావ:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం పునః ప్రారంభమైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్ల తాత్కాలికంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. అయితే గురువారంతో ఎలక్షన్ కోడ్ ముగియడంతో నేటి నుంచి ప్రజావాణి అర్జీల స్వీకరణ కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ చిన్నారెడ్డి తెలిపారు. గతంలో వలే మంగళ, శుక్రవారాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, తమ సమస్యలను అర్జీల ద్వారా ప్రభుత్వ దృష్టి తీసుకురవాచ్చన్నారు. ప్రజావాణిలో వచ్చిన వినతులకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వర పరిష్కారాలు చూపాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. కాగా, ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో ప్రతిరోజూ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తాను కూడా ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తానని తెలిపారు. అయితే మొదటి రోజు మినహా ఆయన ఎప్పుడూ ఈ కార్యక్రమంలో పాల్గొనకపోవడం గమనార్హం. అదేవిధంగా రోజూ నిర్వహిస్తామన్న కార్యక్రమాన్ని వారంలో రెండు రోజులకు కుదించారు.

## హోమియో ఆస్పత్రిలో పెచ్చులూడిన సీలింగ్

### ఇద్దరు పీజీ విద్యార్థులకు తీవ్రగాయాలు

**హైదరాబాద్, ప్రజానావ :** రామంతాపూర్‌లోని ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో సిలింగ్ పెచ్చులూడి పడ్డాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు పీజీ విద్యార్థినులు గాయపడ్డారు. ఆసుపత్రి సిబ్బంది వెంటనే స్పందించి.. వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుప త్రికి తరలించారు. ఒక విద్యార్థినికి తీవ్ర గాయాలు కాగా.. మరో విద్యార్థినికి స్వల్పగాయాలయ్యాయి. దీంతో తీవ్రగాయాలైన విద్యార్థినికి ఐసీయూలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం ఉదయం ఇన్‌పేషంట్ వార్డులో ఈ ఘటన చోటు చేసుకుంది.



# కాంగ్రెస్ గూటికి చేరుకున్న ఎంపీ విశాల్ పాటిల్

- వందకు చేరిన కాంగ్రెస్ సీట్ల సంఖ్య
- స్వాగతించిన మల్లికార్జున ఖర్గే

**న్యూఢిల్లీ, జూన్ 7 :** భారత్‌లో రాజకీయ సమీకరణాలు రోజురోజుకి మారుతున్నాయి. తాజాగా మహారాష్ట్రలో రెబల్ ఎంపీ విశాల్ పాటిల్ తిరిగి తన సొంత పార్టీ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ 99 సీట్లను గెలుచుకున్న సంగతి తెలిసిందే. విశాల్ పాటిల్ మద్దతుతో లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపిల సంఖ్య 100కి చేరింది. వికాస్ పాటిల్ మద్దతును స్వాగతిస్తున్నట్లు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. విశాల్ పాటిల్, విశ్వజిత్ కదమ్‌లు గురువారం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను కలిశారని, పార్టీకి తాను మద్దతు ప్రకటిస్తున్నట్లు విశాల్ పాటిల్ తెలిపారని ఖర్గే వెల్లడించారు. మహారాష్ట్ర వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమిలో సీట్ల ఒప్పందంలో భాగంగా మహారాష్ట్రలోని సాంగ్లీ నియోజకవర్గం శివసేన యుబిటికి కేటాయించారు. దీంతో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వసంత్‌దాదా మనవడైన విశాల్ పాటిల్ కాంగ్రెస్‌పై తిరుగుబాటు ప్రకటించారు. సాంగ్లీ నియోజకవర్గం నుండి స్వతంత్య అభ్యర్థిగా బరిలోకి దిగారు. బిజెపి అభ్యర్థి సంజరు కాకా పాటిల్‌పై విజయం సాధించారు. సీట్ల ఒప్పందానికి ముందే శివసేన వర్గానికి చెందిన ఉద్ధవ్ థాకరే సాంగ్లీ నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించడం వివాదానికి దారితీసింది. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాల్సిందిగా కాంగ్రెస్ పలుమార్లు ఉద్ధవ్ థాకరేను కోరినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో విశాల్ పాటిల్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. మరో నేత పప్పుయాదవ్ కూడా కాంగ్రెస్‌కు మద్దతు తెలపనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలకు ముందు పప్పు యాదవ్ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అయితే సీటల ఒప్పందంలో భాగంగా పూర్ణియా సీటు ఆర్‌జెడికి కేటాయించారు. దీంతో పప్పు యాదవ్ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

# కులగణన చేయాలని మోడీని కోరుతా

- అవసరమైతే ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలుస్తా
- మాజీ ఎంపీ వీహెచ్ వెల్లడి




**హైదరాబాద్, ప్రజానావ:** కులగణన చేపట్టాలని ప్రధాని మోడీని కోరుతానని కాంగ్రెస్ సీనియర్ నేత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హన్మంతరావు అన్నారు. ఈ మేరకు ఢిల్లీకి వెళ్లి మరోసారి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి కులగణన చేయాలని డిమాండ్ చేస్తానని వి.హనుమంతరావు అన్నారు.కేంద్రంలో మూడోసారి ఎన్డీఏ గెలవడంతో మరోసారి మోదీకి ప్రజలు అవకాశం ఇచ్చారని.. ఓటర్ల తీర్పును గౌరవిస్తామన్నారు. మోదీ ఓబీసీ ప్రధాని కానీ బడుగు బలహీనర్గాల సమస్యలను ఇప్పటికైనా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెప్పారని గుర్తుచేశారు. రిజర్వేషన్‌లో 50 శాతం సిలింగ్ ఎత్తివేస్తామని అన్నారన్నారు. ఈరోజు ఎన్డీఏ కూటమి కీ రోల్‌లో జేడీయూ అధినేత నితీష్ కుమార్, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఉన్నారని చెప్పారు. మోదీ వారికి అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. బీహార్‌లో నితీష్ కులగణన చేస్తే 67 శాతం రిజర్వేషన్ బీసీలకు వచ్చిందన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఆలోచనను మోదీ కొనసాగించాలని కోరారు. ఓబీసీ కన్వీనర్‌గా తాను ఉండి రిజర్వేషన్ పెంచాలని మోదీని గతంలో కోరానని గుర్తుచేశారు. ఐఐటీలో కూడా రిజర్వేషన్ కోసం అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయని.. బిల్ పాస్ అయిందని తెలిపారు. మాండల్ కమిషన్ వచ్చింది కానీ బీసీలు చట్ట సభల్లో డబుల్ డిజిట్ కూడా దాటడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నితీష్, చంద్రబాబులు కూడా అన్ని రాష్ట్రాల్లో కుల గణన చేయాలని మోదీని కోరాలన్నారు. స్వాతంత్య్రం వచ్చి 70ఏళ్లు అవుతున్న బీసీలకు న్యాయం జరగడం లేదన్నారు. తెలంగాణలో కులగణన తర్వాత లోకల్ బాడీ ఎన్నికలు నిర్వహిస్తే.. బీసీలకు మేలు జరుగుతుందని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కొంత ఆలస్యమైన కులగణన తర్వాతే రాష్ట్రంలో ఎన్నికలు పెట్టాలని కోరారు. అసెంబ్లీలో కులగణన బిల్లు పాస్ చేయించిన వెంటనే కులగణనను అమల్లోకి తీసుకురావా లని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్‌లు మోదీకి వేంకటేశ్వర స్వామి విగ్రహం అందజేశారని చెప్పారు. ఏపీకి ప్రత్యేక హోదా హామీని మోదీ ఇచ్చారని.. దానిని పట్టుబట్టి అమలు చేయించాలని కోరారు. మూడోసారి ఓబీసీ ప్రధానిగా మోదీ అవుతున్నా రు కాబట్టి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎగ్జిట్ పోల్ ఫలితాలు.. సెన్సెక్స్ మీద ప్రభావం చూపాయని హనుమంతరావు పేర్కొన్నారు.

# అద్వానీ ఆశీర్వాదం తీసుకున్న మోడీ



**న్యూఢిల్లీ, జూన్ 7 :** ఎన్డీయే లోక్‌సభాపక్ష నేతగా ఎన్నికైన నరేంద్ర మోదీ భాజపా కురువృద్ధుడు ఎల్.కె.అద్వాణీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా ఆయన ఇంటికివెల్లిన మోదీ... వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్న విషయాన్ని ఆయనకు స్వయంగా చెప్పారు. ఇద్దరు నేతలూ వివిధ అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అక్కడి నుంచి పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి ఇంటికి వెల్లిన మోదీ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. ఎన్డీయే కూటమి నేతలతో కలిసి మోదీ మరికాసేపట్లో రాష్ట్రపతి భవన్‌కు చేరుకోనున్నారు. తమ వద్ద ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం ఉందని చెబుతూ.. అవకాశం ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేయనున్నారు. శుక్రవారం దిల్లీలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నరేంద్ర మోదీని లోక్‌సభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. తాజా సార్వత్రిక ఎన్నికల్లో భాజపా 240 స్థానాల్లో విజయం సాధించింది. అయితే, మిత్రపక్షాలతో కలిసి 293 స్థానాలను సొంతం చేసుకొని ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది.

# 21 వరకు కవిత జ్యూడిషయల్ కస్టడీ పొడిగింపు




**న్యూఢిల్లీ, జూన్ 7 :** ఢిల్లీ మద్యం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితురాలిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు జ్యుడీషియల్ కస్టడీ కోరుతూ శుక్రవారం సీబీఐ అధికారులు రౌస్ అవెన్యూ కోర్టును ఆశ్రయించారు. దీంతో మరోసారి కవితకు జ్యుడీషియల్ కస్టడీ పొడిగించింది. జూన్ 21 వరకు రౌస్ అవెన్యూ కోర్టు కవితకు కస్టడీని పొడిగించింది. తదుపరి విచారణను జూన్ 21వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. అదే రోజు సీబీఐ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ జరపనున్నది. సీబీఐ కేసులో కవితపై దాఖలైన చార్జిషీట్‌ను కోర్టు విచారణకు తీసుకున్నది. తాను చదువుకోవడానికి కొత్తగా 9 పుస్తకాలు కావాలని కోర్టును కవిత కోరింది. కవిత అభ్యర్థనను రౌస్ అవెన్యూ కోర్టు అంగీకరించింది.

# రెగ్జిన్ షాపులో అగ్నిప్రమాదం

**మహబూబ్‌నగర్, ప్రజానావ:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. చౌరస్తా సమీపంలోని అమ్మవారి దేవాలయం పక్కన ఉన్నటువంటి సాయిరెగ్జిన్ షాపులో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. దట్టంగా పొగ కమ్ముకోవడంతో జనం భయంతో పరుగులు తీశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగడంతో మంటలు ఎగిసిపడి పక్క షాపులకు కూడా వ్యాపించాయి. దీంతో స్థానికులు ÷ర్ సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పుతున్నారు. ఎంత ఆస్తి నష్టం జరిగింది, ఏదైనా ప్రాణనష్టం జరిగిందా అనే విషయాలు తెలియాల్సి ఉంది.



# ప్రత్యేక శ్రద్ధతో బడి బాట నిర్వహించాలి

- సిరిసిల్ల కలెక్టర్ అనురాగ్ జయంతి
- జూన్ 6 నుంచి జూన్ 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహణ

**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా జరుగుతున్న బడిబాట కార్యక్రమంలో పాఠశాలలో బాలికల నమోదు శాతం పెంపొందించడం పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రతి బాలిక తప్పనిసరిగా పాఠశాలల్లో ఎనరోల్ అయ్యే విధంగా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో బడిబాట కార్యక్రమం నిర్వహణ పై రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు ప్రతి ఇంటిని సందర్శించి పిల్లలంతా తప్పనిసరిగా పాఠశాలల్లో విద్యార్థులుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా బాలికల ఎనరొల్మెంట్ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలు ఎక్కడ డ్రాప్ ఔట్ కాకుండా చూడాలని, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సైతం బడిబాట కార్యక్రమంలో పాల్గొంటూ బాలికలు ఎక్కడ విద్యకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట బాలికల తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. బాలికలు పదవ తరగతి ముగిసిన తర్వాత కూడా ఇంటర్ చదివేలా వారి తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి మండల సూపర్‌వైజర్ వారి పరిధిలో గల బాలికల పై శ్రద్ధ వహిస్తూ వారు చదువు కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ జూన్ 6 నుంచి జూన్ 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటి సర్వే చేపట్టి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. జూన్ 8 నుంచి జూన్ 10 వరకు 3 రోజులపాటు ఇంటింటికి తిరిగి పిల్లలందరూ పాఠశాలలో నవోదయల చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల వివరాలు సేకరించి ప్రతి గ్రామంలో గ్రామ రిజిస్టర్లు నమోదు చేయాలని అధికారులకు సూచించారు. జూన్ 11న ప్రతి గ్రామంలో గ్రామ సభ నిర్వహించి బడిబాట కార్యక్రమంలో జరిగిన పురోగతిని చర్చించాలని, జూన్ 12న ప్రతి పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ ద్వారా చేపట్టిన పనులు వివరించాలని, జూన్ 13న జిల్లాలో చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమం గురించి పాఠశాలలో వివరించాలని, జూన్ 14న ప్రాథమిక విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించాలని విద్యాశాఖ అధికారి సూచించారు. జూన్ 15న బాలికల విద్యా ప్రాముఖ్యతను వివరించాలని జూన్ 18న ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఐవిపి ప్యానల్ ద్వారా డిజిటల్ విద్యా బోధన విద్యార్థులకు ప్రారంభించాలని, విద్యార్థులచే మొక్కలు నాటించాలని, జూన్ 19న క్రీడ పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ శేషాద్రి, జెడ్పీ సీఈవో ఉమరాణి, జిల్లా వైద్యాధి కారి సుమన్ మోహన్ రావు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వెల్ఫేర్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మికి పాత చెక్కులే!

- ఊసేలేని తులం బంగారం హామీ
- ఎన్నికల అవసరానికే హామీ ఇచ్చిందని కాంగ్రెస్‌పై లబ్ధిదారులపై ఆగ్రహం
- ఖైరతాబాద్‌లో 81, షేక్‌పేట మండల పరిధిలో 115 చెక్కుల పంపిణీ



**ఖైరతాబాద్, ప్రజానావ:** ఖైరతాబాద్ నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బంజారాహిల్స్‌లోని లేక్‌వ్యూ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. అయితే కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం కూడా ఇస్తానని హామీ ఇవ్వడమే కాకుండా మేనిఫెస్టోలో సైతం చేర్చింది. ఇదిలాఉంటే తాజాగా లబ్ధిదారులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన విధంగానే రూ.లక్ష చెక్కును మాత్రమే అందజేశారు. శుక్రవారం జరిగిన ఈ చెక్కుల పంపిణీలో ఖైరతాబాద్ మండల రెవెన్యూ కార్యాలయం నుంచి 81 చెక్కులు, షేక్‌పేట్ మండల కార్యాలయం నుంచి 115 చెక్కులను ఎమ్మెల్యే దానం నాగేందర్ చేతులమీదుగా అందజేశారు. అయితే చెక్కు తీసుకున్న లబ్ధిదారులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. గత ప్రభుత్వం ఇచ్చినవిధంగానే కేవలం రూ.1లక్ష చెక్కు మాత్రమే ఇచ్చారని, తులం బంగారం ఊసేలేదని ఎన్నికలన్నీ అయిపోయాక ఇచ్చిన హామీని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిందని లబ్ధిదారులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో షేక్‌పేట్ తహశీల్దార్ అనితారెడ్డి, సోమాజిగూడ కాంగ్రెస్ కార్పొరేటర్ వనం సంగీత యాదవ్, రాములు నాయక్, భారతీ నాయక్ మహేందర్, మహేశ్, అరుణ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.



# క్రీడలతో మానసికోల్లాసం

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



**వేములవాడ, ప్రజానావ:** క్రీడలతో మానసికోల్లాసం తో పాటు శారీరక దృఢత్వం ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ పట్టణంలో ప్రెస్ క్లబ్ సౌజన్యంతో సాయి క్రికెట్ టీం ఆధ్వర్యంలో సిరిసి ల్ల జిల్లా స్థాయి మెగా క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో గతంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ వంటి క్రీడలను ఆడే వాళ్లమని గుర్తుచేసుకున్నారు. నేటి ఆధునిక ప్రపంచంలో క్రికెట్ విశ్వవ్యాప్తంగా ఆదరణ పొందిన క్రీడ అని అన్నారు. క్రీడలతో ఆటగాళ్ల మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుంద న్నారు. యువత గ్రామాల్లో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు. మన ప్రాంతంలోని క్రీడాకారులకు ఉపయోగపడేలా అసంపూర్తిగా ఉన్న మినీ స్టేడియాన్ని యుద్ధప్రాతిపదికన త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. స్టేడియంలో క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రిని అందుబాటులోకి తెస్తామన్నారు. వేములవాడ పట్టణ యువకులకు క్రికెట్ ఆడటానికి మైదానం కావాలంటే మర్రిపెల్లి ప్రాంతంలో మైదానానికి స్థల పరిశీలన జరుగుతుందన్నారు. ప్రభుత్వం డ్రగ్స్, గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తోందన్నారు.

## 11న పోలీస్ బెటాలియన్‌లో ఇంటర్వ్యూలు

**సిరిసిల్ల, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా 17వ పోలీస్ బెటాలియన్, సర్దాపూర్‌లో గతేడాది ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారికి ఈ నెల 11, 12 తేదీల్లో రెండ్రోజులు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు, ఈ ఇంటర్వ్యూలు సర్దాపూర్ బెటాలియన్‌లో ఉంటాయని కమాండెంట్ ఎస్. శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు సంబంధిత అర్హత పత్రాలు, పోలీస్ క్లియరెన్స్ సర్టిఫికెట్‌తో బెటాలియన్ కాన్ఫరెన్స్ హాల్ వద్ద ఉదయం 8:00 గంటలకు మౌఖిక పరీక్ష కి హాజరు కావాలని సూచించారు. వివరాలకు రిసెప్షన్ 87126 57570, ఎండీ ఫసీయుద్దీన్ 8712589923 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉజ్వల భవిష్యత్తు

**డీఈఓ రమేశ్ కుమార్**

**సిరిసిల్ల, ప్రజానావ:** ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, నాణ్యమైన విద్యకోసం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని రాజన్న సిరిసిల్ల డీఈఓ రమేశ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకంపేట ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాటలో భాగంగా తారకరామానగర్, గణేశ్ నగర్, సుందరయ్య నగర్, వెంకంపేట, పద్మనగర్, బీవై నగర్ ప్రాంతాల్లో చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సకల సౌకర్యాలతో, సరికొత్త హంగులతో,అటల్ టింకరింగ్ ల్యాబ్, కంప్యూటర్ విద్య, ఉచిత పాఠ్య పుస్తకాలు, రెండు జతల డ్రెస్లు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్యతో పాటు అనుభవం అర్హతగల ఉపాధ్యాయులతో, ఆధునిక పరిజ్ఞానంతో, అమ్మ ఆదర్శ కమిటీలతో, డిజిటల్ తరగతులతో, విశాలమైన భవనాలతో, చక్కని క్రీడా ప్రాంగణాలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలలో చేరాలని, చేర్పించాలని పిలుపునిచ్చారు. ఎంఈఓ దూస రఘుపతి మాట్లాడుతూ ఐఐటీ సీట్లు సాధించాలన్న, ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ రావాలన్న 10 జీపీఏ సాధిచాలన్న వెంకంపేట ఉన్నత పాఠశాలలోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దూస రఘుపతి, సెక్టోరియాల్ అధికారి సతీష్, స్థానిక కౌన్సిలర్ కల్లూరి రాజు, కమలాకర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్, పద్మ, భారతి, వెంకంపేట పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# 13న జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా

- యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలి
- సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్ల, ప్రజానావ:** నిరుద్యోగ యువత అవకాశాలను అందిపుచ్చుకొని రాణించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఈ నెల 13న జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దడమే కాకుండా విలాసాలకు అలవాటైన యువత దృష్టి మళ్లించేందుకు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగానే మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ జాబ్‌మేళాను పదోతరగతి, ఇంటర్, డిగ్రీతో పాటు బీటెక్‌లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ–యువకులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా జాబ్‌మేళాలో పేరు నమోదు కోసం https://me-qr.com/z0s8PfJt లింక్ ఓపెన్ చేసి వివరాలని ఇవ్వాలని సూచించారు.

## ప్రైవేట్ హాస్పిటల్స్ ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలి


**కలెక్టర్ అనురాగ్ జయంతి**

**సిరిసిల్ల, ప్రజానావ :** ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్ యాజమాన్యం తప్పనిసరిగా రాష్ట్ర అగ్ని మాపక శాఖ నుంచి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 144 ప్రైవేట్ హాస్పిటల్స్ ఉన్నాయని వెల్లడించారు. ఆయా దవాఖానల్లో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకున్న వారందరూ తప్పనిసరిగా అగ్నిమాపక శాఖ వెబ్సైట్ https:// fire.telangana.gov.in/ లో తమ హాస్పిటల్ వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం అగ్ని మాపక శాఖ వారితో ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయించుకొని ఫైర్ శాఖ ద్వారా ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



## గోవిందరాజుల స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం సనుగుల గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజుల స్వామి వారితో పాటు రామరావు పల్లెలోని బీరప్ప స్వామి వారిని శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ కు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆది శ్రీనివాస్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు.



## గ్రామానికి బాడీ ఫ్రీజర్ అందజేత

**చందుర్తి ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్యాల గ్రామానికి దుబాయిలో ఉన్న ఎన్నారై మిత్రులు శుక్రవారం బాడీ ఫ్రీజర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి వెంబడి సైన్ బోర్డులు పెట్టడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. బాడీ ఫ్రీజర్ అందజేయుటకు సహకరించిన దుబాయ్ ఎన్నారై మిత్రులు, కుటుంబీకులను గ్రామ ఆర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన ఎల్ల రమేశ్, ఈదురు గాలులతో ఇంటిపై రేకులు కొట్టుకుపోయిన కీర్తి సంధ్యా, వెంకటేశ్, అనారోగ్యంతో మృతి చెందిన బంటు ఆనందం కుటుంబాలకు గ్రామాభివృద్ధి –దుబాయ్ గ్రూప్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి జెడ్పిటిసి నాగం కుమార్,



## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

**చందుర్తి, ప్రజానావ:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో భోజ సుభాష్ అక్రమంగా నిల్వ ఉంచిన సుమారు 20 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ ను శుక్రవారం చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్ స్వాధీనం చేసుకున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు ఇంట్లో సోదా చేయగా ఒక రూమ్ లో పీడీఎస్ రైస్ నిల్వ ఉంచారు. ఈ బియ్యాన్ని రైస్ మిల్లుకు తరలించి, నిందితుడు సుభాష్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఓ వ్యక్తిని మహనీయునిగా.. మహాత్మునిగా..

జాతి హితం కోరుతూ తమ జాతి సమగ్రాభివృద్ధి కోసం అహోరాత్రులు శ్రమిస్తూ జాతి ఔన్నత్యం కోసం పాటుపడుతూ జాతి సుఖ శాంతుల కోసం నిరంతరం సహనం, శాంతితో అందర్నీ కూడగట్టుకుంటూ, వ్యతిరేక భావాలకు సమాధానలిస్తూ సమాజంలో సుస్థిరతే ధ్యేయంగా ముందుకు సాగే వారే జాతీయ మహాత్ములు. వారే మహనీయులు. వారి ఆధ్వర్యంలో సకల జాతి అభివృద్ధి పథంలో నడుస్తుంది. వారిని అట్టడుగున ఉన్న ప్రజానీకం కూడా గుర్తిస్తుంది. వారి బాటలో నడుస్తుంది. తద్వారా ఇటు వ్యక్తికీ అటు సమాజానికి మంచి పేరు వస్తుంది. మంచికోసం చేసే పోరాటంలో ఒడి దొడుకులు,ఆటుపోట్లు తప్పవు. నిరసనలు, ధర్నాలు తప్పవు. అన్నిటిని ధైర్యంతో ఎదు–రుకుంటూ ముందుకు సాగడమే మంచిని చిరస్థాయిగా నిలబెట్టడానికి దోహదపడుతుంది. ఇదే ఓ వ్యక్తిని మహాత్మునిగా, మహనీయునిగా, ఆదర్శ వ్యక్తిగా తీర్చిదిద్దుతుంది.అటువంటి వ్యక్తి ఒక తన సమాజంలోనే కాదు యావత్ ప్రపంచంలో కీర్తి గడిస్తాడు.



– మిత్రాజీ
(ప్రభాకర్‌రావు గుండవరం, అత్వెల్లి, మేడ్చల్ )
ఫోన్ నం. 9949267638



## పారితోషికాన్ని వెంటనే చెల్లించాలి


**జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి**

**ఆసిఫాబాద్, ప్రజానావ:** ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తో పాటు స్పాట్ వాల్యుయేషన్‌లో పాల్గొన్న సిబ్బందికి చెల్లించే పారితోషికం ఎప్పటికప్పుడు చెల్లించాలని జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షుడు నవీన్ రెడ్డి డిమాండ్ చేశారు. మంచిర్యాలలో నిర్వహిస్తున్న స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో ఆసిఫాబాద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం డీఐఈవో శైలజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పరీక్ష విధులకు సంబంధించిన మొత్తంతో పాటు, ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ మొత్తాన్ని కూడా గతంలో మాదిరిగా చెల్లించాలన్నారు. పారితోషికం మొత్తం 10 శాతం తగ్గించి ఇవ్వడం సరికాదన్నారు. గతంలో చాలా సార్లు వినతి పత్రాలు అందజేశామని, వెంటనే దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. డీఐఈవో స్పందిస్తూ ప్రస్తుత సంవత్సరం నేరుగా చెల్లించే ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు అమరేందర్, చంద్రయ్య, రాజమౌళి, ప్రభాకర్, తిరుపతి, కిషోర్ పాల్గొన్నారు.

## పోలీసుల సహకారంతో కృత్రిమ కాలు



**బెజ్జూర్, ప్రజానావ:** బెజ్జూర్ మండలంలోని ముంజంపల్లి గ్రామ వాసి ఆత్రం భుజంగారావు గత సంవత్సరం ప్రమాదవశాత్తు కాలును కోల్పోయాడు. 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో భాగంగా ఎస్పీ కే సురేష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 6న బెజ్జూర్ ఎస్సై విక్రమ్ అతనికి జైపూర్ కృత్రిమ కాలు ఏర్పాటు చేశారు. ఆత్రం భుజంగారావు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముంజంపల్లి గ్రామస్తులు డబ్బుల రమేష్, రుషి, పోలీసు సిబ్బంది విజయ్, మహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఐఏఎస్‌గా రేవయ్య బాధ్యతలు

**హర్షం వ్యక్తం చేసిన జిల్లావాసులు**

**ఆసిఫాబాద్, ప్రజానావ:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని తుం గెడకి చెందిన యువకుడు డోంగ్రే రేవయ్య 2022-23 సివిల్ సర్వీస్ బ్యాచులో దేశవ్యా ప్తంగా 410వ ర్యాంకు సాధించారు. శుక్రవా రం మహారాష్ట్రలోని వార్ధా తాలూకాలో అదన పు పాలనాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేశారు. తన కుటుంబ సభ్యులు, బంధువులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### 106 క్వింటాళ్ల

## రేషన్ బియ్యం పట్టివేత



**కాగజ్‌నగర్ టౌన్, ప్రజానావ:** సిర్పూర్(టీ) మండలంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం శుక్రవారం సిర్పూర్ నుంచి మహారాష్ట్ర వైపు అక్రమంగా తరలిస్తున్న 106 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నది. పక్కా సమాచారం మేరకు సిర్పూర్ మండలం వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా, కాగజ్ నగర్ నుంచి సిర్పూర్ మీదుగా మహారాష్ట్ర వైపు అక్రమంగా తరలిస్తున్న 106 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రశాంత్‌రావు తెలిపారు.

# బడి బస్సు భద్రమేనా!?

- రవాణా శాఖ నిబంధనల మేరకే నడుస్తున్నాయా?
- చిన్నారుల జీవితాలతో చెలగాటం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు
- ఫిట్‌నెస్‌కు రాకున్నా ఒత్తిడి చేయలేకపోతున్న ఆర్టీఏ
- ఎఫ్‌సీ లేకుండా రోడ్డెక్కితే సీజ్ చేస్తాం: రవాణా శాఖ
- స్కూలు విద్యార్థులను తరలించే ఆటోలపైనా నిఘా



**నేరడిగొండ, ప్రజానావ:** పాఠశాల విద్యార్థులను బడికి తీసుకెళ్లే బస్సులు సురక్షితమేనా? రవాణా శాఖ నిబంధనల మేరకు పూర్తి ఫిట్‌నెట్‌తో ఉన్నాయా? తనిఖీల్లో అన్నీ క్షుణ్ణంగా పరిశీలించాకే ఎంవీఐలు ఎఫ్‌సీ ఇస్తున్నారా? పిల్లలను స్కూలు బస్సు ఎక్కించిన తర్వాత తల్లిదండ్రులు నిశ్చింతగా ఉండొచ్చా?.. అంటే ఈ ప్రశ్నలకు సమాధానం లభించడం కష్టమవుతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలని ఫీజుల రూపంలో రూ.వేలు ఇచ్చి ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించకుండా పిల్లలు నిత్యం ఇంటి నుంచి పాఠశాల, కళాశాలలకు రాకపోకలు సాగించే బడి బస్సుల సామర్థ్యంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వీరే కాకుండా విద్యా సంస్థల యాజమా న్యాలు వాటి నిర్వహణపై జాగ్రత్తలు తీసుకుంటే విద్యార్థుల ప్రయాణం సురక్షితం అవుతుంది. త్వరలో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు రవాణాశాఖ కార్యాలయాల్లో జూన్ 15వ తేదీలోగా ఫిట్నెస్ పత్రాలు సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి.

### ఫిట్‌నెస్ లేకుండానే..

పాఠశాలలు ప్రారంభం కానుండటంతో విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేకుండానే రయ్-రయ్‌మంటూ వెళ్తున్నాయి. చిన్నారుల జీవితాలతో ప్రైవేటు స్కూల్ బస్సుల యజమానులు చెలగాటుమాడుతున్నారు. ఆర్టీఏ అధికారుల తనిఖీలు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా తిరుగుతున్నాయి. పలు బస్సులకు ఫిట్‌నెస్, పర్మిట్ లేకున్నా రోడ్డెక్కి దర్జాగా స్కూల్ పిల్లలను తరలిస్తున్నాయి. బస్సు పూర్తి స్థాయి కండీషన్‌లో ఉంటేనే రోడ్లపై తిరగడానికి అర్హత ఉంటుంది. కండీషన్ లేని బస్సులు నడిపితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో పిల్లలను తరలించినపుడు ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులు ఎవరని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఆర్టీఏ అధికారులు స్కూల్ బస్సులను తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం లేని బస్సులను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. డొక్కు బస్సులతోనే ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులను తరలిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఈ నిబంధనలు పాటించాలి

- బస్సుల్లోని కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసల పైపులను విద్యార్థులు తల బయట పెట్టి తొంగి చూడకుండా ఉండేలా అమర్చాలి.
- బస్సు కండీషన్ ఉండటమే కాకుండా బ్రేకు వేసిన సమయంలో నాలుగు వైపులా పార్కింగ్ లైట్లు వెలగాలి.
- ప్రథమ చికిత్స- బాక్సు అత్యవసర ద్వారాలుండాలి. చిన్న పిల్లలు బస్సుల్లో ఎక్కేలా. మెట్ల కింది భాగంలో మరో మెట్టు ఏర్పాటు చేసుకోవాలి.
- పాఠశాల. కళాశాల బస్సు నడిపే డ్రైవరు వయసు 60 ఏళ్ల లోపుండాలి

### ఐదేండ్ల అనుభవం ఉండాలి

- ప్రతి పాఠశాల బస్సుకు డ్రైవరుతో పాటు సహాయకుడిని (అటెండెంటు) నియమించుకోవాలి. బస్సులో ఏదేని అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు వీలుగా ఫైర్ ప్రొటెక్షన్ సిలిండర్ ఉండాలి.
- డ్రైవర్ బస్సును వేగంగా నడిపినా, అజాగ్రత్తగా వ్యవహరించినా, చరవాణిలో మాట్లాడుతూ వాహనం నడిపినా అతనిపై చర్యలు తీసుకునేలా పాఠశాల పేరెంట్స్ కమిటీ ద్వారా బస్సుల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి.

### ఇవి తప్పనిసరి..

పాఠశాల, కళాశాలల బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయిం చేందుకు వీలుగా ఉమ్మడి జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉంటున్నారు. ఫిట్‌నెస్ ధ్రువపత్రం, పర్మిట్, బీమా, పొల్యూషన్ పత్రాలు, డ్రైవర్‌కు సంబంధించి వ్యాల్యుడ్ లైసెన్సు సమర్పించి పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. డ్రైవరుతో పాటు బస్సులో ఉండే అటెండెంటు వివరాలను కార్మిక శాఖ కార్యాలయం లో నివేదించి వారు ధ్రువీకరించిన పత్రం సైతం రవాణా శాఖ కార్యాలయంలో సమర్పించాలి. అయితే చాలా వరకు పాఠశాలల యాజమాన్యాలు అంతగా ఆసక్తి చూపడం లేదు. చిన్నారుల ప్రయాణ విషయంలో జాగ్రత్తలతో అన్నీ పత్రాలు సమకూర్చుకుని ఫిటెనెస్ చేయించుకుంటేనే బస్సులు రోడ్లపైకి రావాలని రవాణా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లాలో 125 మొత్తం బడి బస్సులుండగా వాటిలో శుక్రవారం వరకు కేవలం 70 బస్సులకు మాత్రమే యాజమాన్యాలు సామర్థ్య పరీక్షలు చేయించారు. ఇంకా 55 బస్సులకు చేయించాల్సి ఉంది.

### పిటినెస్ లేకుండా రోడ్డెక్కితే సీజ్ చేస్తాం



పాఠశాలలు, కళాశాలలు, పుణ ప్రారంభమవుతున్న దృష్ట్యా బస్సులకు తప్పకుండా సామ ర్థ్య పరీక్షలు చేయించు కోవాలి. జిల్లాలో నమోదైన పాఠశాలల బస్సుల యజమా నులు వీటిపై దృష్టి సారించాలి. ఏ ఒక్క పత్రం లేకుండా బస్సు రోడ్డెక్కితే అలాంటి వాటిపై చర్యలు తీసుకోవడమే కాకుండా సీజ్ చేస్తాం. స్కూలు విద్యార్థులను తరలించే వాహనాలపై నిఘా పెట్టాం.

– శ్రీనివాస్, రవాణా శాఖ ఇన్‌స్పెక్టర్, ఇన్‌చార్జి డీటీవో

## సమాచార హక్కు చట్టంను

# ఎలా ఉపయోగించుకోవాలి?




**హైదరాబాద్, ప్రజానావ:** చట్టాలు ప్రజలకు ఉపయోగపడాలి. ఆ విధంగా వాటిని అమలు చేసే వ్యక్తులు క్రియా త్మకంగా వ్యవహరించాలి. లేకపోతే ఆ చట్టము లక్ష్యం నెరవేరదు. అది నిర్వీర్యం అవుతుంది. పౌరులకు ఆచరణయోగ్యమైన సమా చార హక్కు కల్పించి, తద్వారా ప్రతి అధికార యంత్రాంగము దగ్గర ఉన్న సమాచారాన్ని పౌరులకు అందుబాటులోకి తెచ్చేందు కు, పౌరులకు ఉన్న సమాచార హక్కును చట్టబద్ధం చేసి, ప్రతి ప్రభుత్వం యంత్రాంగములో పారదర్శకత, జవాబుదారీ తనము తీసుకురావడం ఈ చట్టం ఉద్దేశ్యము అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. సమాచార హక్కు చట్టంలోని 7(6) ప్రకారము అభ్యర్థన అందిన 30 రోజుల్లోగా దరఖాస్తుదారు కోరిన సమాచారాన్ని ఇవ్వడంలో విఫలమైనప్పుడు ఫీజుతో నిమిత్తం లేకుండా ఆ సమాచారాన్ని ఉచితంగా ప్రజా సమాచార అధికారి అందించాల్సి ఉంటుంది. ఆ ఫీజు సహేతుకంగా ఉండాలి. దారిద్య రేఖకు దిగువన ఉన్నవారి నుంచి ఎలాంటి ఫీజు వసూలు చేయకూడదు అని సాయి చౌదరి తెలిపారు. అంతేకాదు సెక్షన్ 7(3) ప్రకారం సమాచారం అందించడానికి ఎక్కువ మొత్తం వసూలు చేయాలని నిర్ణయించినప్పుడు ఆ విషయాన్ని దరఖాస్తుదారునికి తెలియజేయాలి. ఆ ఫీజును మరొకసారి పరిశీలన చేయమని కోరే హక్కు దరఖాస్తుదారునికి ఉందని, అందుకున్న కాలపరిమితిని, అనుసరించాల్సిన పద్ధతులను, అప్పీలును ఎవరి ముందు దాఖలుచేయాలో ఆ వివరాలను కూడా తెలియజేయాలి. సెక్షన్ 7(9) ప్రకారం కోరిన సమాచారాన్ని దరఖాస్తుదారుడు అడిగిన రూపంలోనే అందించాలి. ఆ విధంగా కాకుండా వేరే విధంగా కూడా సమాచారాన్ని ఇచ్చే అధికారము ప్రజా సమాచార అధికారి ఉంటుంది. వనరులు ఎక్కువ ఖర్చయ్యే సందర్భంలో ఆ విషయాన్ని తెలియజేస్తూ, తక్కువ ఖర్చు అయ్యే విధంగా మరో రూపంలో ఇచ్చే అవకాశం ప్రజా సమాచార అధికారికి ఉంటుంది. ఈ చర్యలేవి తీసుకోకుండా కొన్ని వేల రూపాయల్లో, కొన్ని లక్షల రూపాయలు డబ్బు చెల్లించాలని చెప్పడం సమాచారాన్ని కోరుతున్న వ్యక్తులను నిరుత్సాహపరచడమే అవుతుంది. మరో విధంగా చెప్పాలంటే బెదిరించడం అవుతుంది. సంబంధంలేని సమాచారం ఇవ్వకుండా సంబంధించిన సమాచారం ఇస్తే అంత మొత్తం అవసరం ఉండదు. దరఖాస్తులు జాగ్రత్తగా గమనించి అవసరమైన సమాచారాన్ని ఇవ్వడానికి ప్రయత్నించవచ్చు. కానీ ఆ అధికారులు ఉద్దేశం మరో విధంగా ఉన్నప్పుడు ఇలాంటి చర్యలనే వాళ్ళు తీసుకుంటారు. ఇలాంటి చర్యలు ఎండగట్టాలంటే సమాచార హక్కు చట్టం గురించి పూర్తి అవగాహన ఉండాలి. చట్టంలోని నిబంధనలను అర్థం చేసుకుంటే ప్రజా సమాచార అధికారులు తీసుకునే ఎలాంటి చర్యలనైనా అధిగమించే పరిస్థితి ఏర్పడుతుంది. సమాచారాన్ని ఎవరైనా కోరవచ్చు. ఎందుకు కోరుతున్నారో కారణం కూడా తెలియజేయాల్సిన అవసరం లేదు. దారిద్యరేఖకు దిగువన ఉన్న వ్యక్తులు సమాచారం పొందటానికి ఎలాంటి చెల్లించాల్సిన అవసరం లేదు. ఈ విషయములను అర్థం చేసుకుంటే అన్ని ఆటంకాలను అధిగమించే అవకాశం ఉంటుంది అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి వివరించారు. ప్రజలు ప్రభుత్వ చర్యల్లో పాల్గొనడం వల్ల ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. ఎన్నికలు అప్పుడు మాత్రమే కాదు, రోజు వారి ప్రభుత్వ కార్యకలాపాల్లో పౌరులు పాల్గొనాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాలసీలు, స్కీముల అమలు సక్రమంగా జరుగుతున్నవా అనే విషయం పరిశీలించాలి. ఇవి చేయాలంటే చట్టం పట్ల అవగాహన ఉండాలి. ఆ ప్రయత్నం అందరూ చేయాలి అని సాయి చౌదరి అన్నారు.



## వాహనాల పన్ను చెల్లించాలి

**సిరిసిల్ల జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్**

**సిరిసిల్ల, ప్రజానావ:** జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు తమ వాహన పన్ను రవాణా శాఖకు చెల్లించా లని జిల్లా రవాణా శాఖ అధికారి వీ లక్ష్మణ్ పేర్కొన్నారు. పన్ను చెల్లించన్ని వాహనాలు తనిఖీల్లో పట్టుబడితే సంబంధిత వాహనం పన్నుపై అపరాధ రుసుం మొదటి నెల 50 శాతం, రెండో నెల 100 శాతం, మూడో నెలలో 200 శాతం అదనంగా వసూలు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలోని వాణిజ్య, వాణిజ్యేతర వాహనదారులు గమనించి సకాలంలో తమ వాహన పన్నును చెల్లించాలని సూచించారు.

# కన్నప్ప టీజర్ 14న విడుదల

## కేన్స్‌లో అద్భుత స్పందన వచ్చిందన్న మంచు

అత్యంత భారీ నిర్మాణవ్యయం, అత్యాధునిక సాంకేతికతో రూపొందుతున్న ఫాంటసీ డ్రామా 'కన్నప్ప'. మంచు విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ మూవీ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు కథానాయకుడు విష్ణు తెలిపారు. ఎక్స్ వేదికగా ఈ విషయాన్ని తెలియజేస్తూ పోస్ట్ పెట్టారు. 'కేన్స్‌లో అద్భుతమైన స్పందన వచ్చిన తర్వాత ఈ విషయాన్ని మీతో పంచుకోవడానికి ఎంతో థ్రిల్‌గా అనిపిస్తోంది. పురాణగాథ 'కన్నప్ప' మూవీ టీజర్‌ను జూన్ 14న మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఈ చిత్రానికి నా గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. ఇక కన్నప్ప ప్రపంచంలోకి మిమ్మల్ని ఆహ్వానించకుండా ఉండలేను' అని పేర్కొన్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ఇటీవల జరిగిన షెడ్యూల్‌లో బాలీవుడ్ హీరో అక్షయ్‌కుమార్ పాల్గొన్నా రు. అక్షయ్ ఈ చిత్రంలో శివుడి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. నందీశ్వరుడి పాత్రను ప్రభాస్ పోషించనున్నట్లు ప్రచారం సాగుతోంది. వీరితో పాటు మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, ఆర్.శరత్‌కుమార్, బ్రహ్మానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. స్టీఫెన్ దేవస్సే, మణిశర్మ సంగీతం అందిస్తున్నారు. 'కన్నప్ప' చిత్రం అత్యధిక భాగాన్ని న్యూజిలాండ్‌లో చిత్రీకరించారు. ప్రస్తుతం ముగింపు దశ చిత్రీకరణలో ఉన్న ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది.







# విదేశాల్లో కల్కి క్రేజీ అదుర్స్

## విడుదలకు ముందే భారీగా టిక్కెట్ల బుకింగ్

సినీ ప్రియులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఓవర్సీస్‌లో ఈ సినిమా జూన్ 26నే విడుదల కానుంది. అక్కడ దీని అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా టికెట్స్ హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. విదేశాల్లో ఈ చిత్రాన్ని 124 లోకేషన్లలో విడుదల చేయనున్నారు. ఇప్పటి వరకు 116 థియేటర్లలో అడ్వాన్స్ బుకింగ్స్ ఓపెన్ చేయగా ఒక్కరోజులోనే 4933 టికెట్స్ అమ్ముడయ్యాయి. త్వరలోనే థియేటర్ల సంఖ్య పెంచనున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన తన బ్లాగ్‌లో షేర్ చేసిన ఓ అప్‌డేట్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. 'మరో బిజీ డే. నా అప్‌కమింగ్ సినిమాలోని పాటకు సంబంధించిన పనుల్లో బిజీగా ఉన్నాను. త్వరలోనే అది మీ ముందుకు రానుంది' అని తెలిపారు. దీంతో కల్కి (ఐజీ÷ఖతి 2898 ంఆ) పోస్ట్ ప్రొడక్షన్ పనులే అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ చిత్రబృందం కూడా అమితాబ్‌కు సంబంధించిన కొత్త పోస్టర్‌ను పంచుకొని జూన్ 10న ట్రైలర్ రానున్నట్లు తెలిపింది. ప్రభాస్ (ఖసజీశిఠజీబ) సరసన దీపిక పదుకొణె నటిస్తుండగా.. సీనియర్ హీరో కమల్ హాసన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే పశుపతి, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# రామ్‌చరణ్ ఫ్యాన్‌గా మారిన అలెగ్జాండర్ అలెక్స్

గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద సూపర్ క్రేజ్ సంపాదించుకొని ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న అతి కొద్ది మంది టాలీవుడ్ యాక్టర్లలో ఒకడు రాంచరణ్ . ఆర్‌ఆర్‌ఆర్ సినిమాతో వరల్డ్‌వైడ్‌గా అదిరిపోయే స్టార్ ఇమేజ్‌తో గ్లోబల్ స్టార్‌గా మారిపోయాడు. రాంచరణ్‌కు ఇప్పటికే చాలా మంది సెలబ్రిటీలు అభిమానులుగా మారిపోయారని తెలిసిందే. తాజాగా ఈ జాబితాలో అమెరికన్ పాపులర్ డీజే బ్యాండ్ ది చైన్ స్మోకర్స్ చేరిపోయింది. ది చైన్ స్మోకర్స్ మెంబర్ అలెగ్జాండర్ అలెక్స్ ఓ షోలో ఈ విషయాన్ని చెప్పాడు. మీకు ఒకవేళ అవకాశమొస్తే ఏ బాలీవుడ్ లేదా భారతీయ నటుడితో పనిచేయాలనుకుంటున్నారు.. అని ది చైన్ స్మోకర్స్ మెంబర్ అలెగ్జాండర్ అలెక్స్ పాల్‌ను అడిగాడు యాంకర్. దీనికి రాంచరణ్ అని సమాధానం ఇచ్చాడు అలెక్స్ . ఆర్‌ఆర్‌ఆర్‌లో నమ్మశక్యం కాని యాక్టింగ్‌తో అదరగొట్టేశాడని అన్నాడు. ఈ కామెంట్స్‌తో రాంచరణ్ క్రేజ్ ఏ రేంజ్‌లో పెరిగిపోయిందో మరోసారి అర్థమవుతుంది. రాంచరణ్ ప్రస్తుతం ఆర్‌సి 15గా వస్తోన్న గేమ్ చేంజర్ షూటింగ్‌ను పూర్తి చేసే పనిలో ఉన్నాడని తెలిసిందే. మ-రోవైపు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో ఆర్‌సీ 16గా స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా నటిస్తున్నాడు. ఈ మూవీని సుకుమార్ రైటింగ్స్-మైత్రీ మూవీ మేకర్స్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. దీంతోపాటు హోం బ్యానర్ సుకుమార్ రైటింగ్స్‌పై సుకుమార్ దర్శకత్వంలో ఆర్‌సీ 17లో కూడా నటిస్తు?న్నాడు.



# శంకర్, అజిత్ కాంబినేషన్ సూపర్

సినీ ఇండస్ట్రీలో అప్పుడప్పుడు కొన్ని క్రేజీ కాంబినేషన్స్‌కు సంబంధించిన వార్తలు తెరపైకి వస్తుంటాయని తెలిసిందే. ఇప్పుడలాంటి వార్తే ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. ఇంతకీ ఆ క్రేజీ కాంబో ఏంటనుకుంటున్నారా..? తల అజిత్‌కుమార్ , స్టార్ డైరెక్టర్ శంకర్. ఈ ఇద్దరు స్టార్ సెలబ్రిటీలు గత వారం చెన్నైలో కలిశారని, వీరి కలయికలో సినిమా వచ్చే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ సర్కిల్‌లో ఇంట్రెస్టింగ్ గాసిప్ ఒకటి హల్ చల్ చేస్తోంది. ఇద్దరి మధ్య చర్చలు సఫలమయ్యాయని, అన్నీ కుదిరితే త్వరలోనే గుడ్ న్యూస్ వినే టైం రాబోతుందని జోరుగా టాక్ నడుస్తోంది. దీనిపై ఏదైనా అప్‌డేట్ వస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్. ఇదే నిజమైతే ఈ ఇద్దరి కాంబోలో రాబోతున్న తొలి ప్రాజెక్ట్ కానుంది. అజిత్‌కుమార్, శంకర్ ప్రస్తుతం తమ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. శంకర్ భారతీయుడు సీక్వెల్ కమల్ హాసన్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఇండియన్ 2తోపాటు రాంచరణ్ నటిస్తోన్న గేమ్‌చేంజర్ సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ రెండు సినిమాలు విడుదల తర్వాత మరి అజిత్ కుమార్ సినిమాపై ఏదైనా వార్త బయటకు వస్తుందేమో చూడాలంటున్నారు. అజిత్‌కుమార్ ప్రస్తుతం మగిజ్ తిరుమేని విద్యాముయార్చీ సినిమా చేస్తుండగా.. షూటింగ్ దశలో ఉంది. ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. అజిత్‌కుమార్ మరోవైపు గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో కూడా నటిస్తున్నాడు.

# సూపర్ మ్యాన్‌గా అరవింద్ కృష్ణ



టాలీవుడ్ యాక్టర్ అరవింద్ కృష్ణ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్నాడని తెలిసిందే. అరవింద్ కృష్ణ హీరోగా నటిస్తోన్న తాజా ప్రాజెక్ట్ ఏ మాస్టర్ పీస్ . సుకు పూర్వజ్ దర్శకత్వం వహిస్తున్నాడు. తెలుగు సూపర్ హీరోగా వస్తోన్న ఈ సినిమా నుంచి నేనేంటో, నేనెవరో ఇదే.. గేమ్ ఆన్.. అంటూ లాంఛ్ చేసిన లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. చాలా రోజుల తర్వాత ఈ మూవీ అప్‌డేట్ అందించింది అరవింద్ కృష్ణ టీం. పురాణాల నుంచి కొత్త సూపర్ హీరో ఉద్భవించాడు. టీజర్ లాంచ్ ఈవెంట్‌తో మాస్టర్‌పీస్ సూపర్ హీరో యూనివర్స్‌ను లాంఛ్ చేస్తోందంటూ టీజర్ అప్‌డేట్ అందించారు. తాజా లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. ఈ మూవీలో అరవింద్ కృష్ణ సూపర్ మ్యాన్‌గా అలరించబోతున్నట్టు ఇప్పటికే విడుదల చేసిన లుక్స్ చెబుతున్నాయి. ఏ మాస్టర్ పీస్‌లో మనీష్ గిలాడా విలన్‌గా నటిస్తున్నాడు. ఇంతకీ ఈ సూపర్ విలన్‌ను డైరెక్టర్ ఎలా చూపించబోతున్నాడనేది సస్పెన్స్ నెలకొంది. ఏ మాస్టర్ పీస్ నుంచి లాంఛ్ చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్లు సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ మూవీలో బిగ్‌బాస్ ఫేం అషు రెడ్డి ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. ఈ చిత్రాన్ని సినిమా బండి ప్రొడక్షన్ బ్యానర్‌పై శ్రీకాంత్ కండ్రగుల తెరకెక్కిస్తున్నాడు. అరవింద్ కృష్ణ దీంతోపాటు వన్ ఆఫ్ ది లీడ్ రోల్‌లో అండర్ వరల్డ్ బిలియనీర్స్ లో కూడా నటిస్తున్నాడు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీని గగన్ గోపాల్ ముల్కా డైరెక్ట్ చేస్తున్నాడు. ఇప్పటికే లాంఛ్ చేసిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ మూవీ కొత్త అప్‌డేట్ రావాల్సి ఉంది.




# ధనవంతుల జాబితాలో ఇద్దరూ ఇద్దరే..

- తెలుగు రాష్ట్రాల్లో రిచెస్ట్ ఎంపీలు వారే
- పెమ్మసాని, కొండాల ఆస్తులు అనంతం

**హైదరాబాద్, ప్రజానావ:** మన దేశంలోని కొత్తగా ఎన్నికైన ఎంపీల్లో అందరికన్నా ధనవంతులు తెలుగు రాష్ట్రాల్లోనే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసినప్పుడు ఆయా అభ్యర్థులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అత్యంత ధనవంతుడిగా గుంటూరుకు చెందిన టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్ నిలిచారు. ఆ తర్వాతి స్థానంలో తెలంగాణకు చెందిన బీజేపీ నేత కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఉన్నారు. తాజాగా ముగిసిన లోక్ సభ ఎన్నికల్లో వీరు ఇద్దరూ గెలవడంతో అత్యంత ధనవంతుడైన ఎంపీగా పెమ్మసాని నిలవగా.. బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రెండో స్థానంలో ఉన్నారు. ఇటీవల జరిగిన ఏపీ ఎన్నికలలో టీడీపీ కూటమి విజయం సాధించింది. 164 అసెంబ్లీ, 21 ఎంపీ సీట్లు కైవసం చేసుకుంది. గుంటూరులో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన పెమ్మసాని చంద్రశేఖర్ గెలవడంతో దేశంలోనే ఆయన అత్యంత ధనిక ఎంపీగా నిలిచారు. ఆయన తన ఆస్తులను రూ. 5,705 కోట్లుగా ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించారు. పెమ్మసాని ప్రొఫెషన్ డాక్టర్. అయితే, ఆయన ఇలా రూ.వేల కోట్లకు ఎలా అధిపతి అయ్యారనేది అందరిలోనూ ఆసక్తిగా మారింది. పెమ్మసాని తన అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాల ప్రకారం.. తన పేరుపై ఉన్న ఆస్తులు రూ.2 వేల కోట్ల పైచిలుకే. తన భార్య కోనేరు శ్రీరత్న పేరు మీద మరో రూ.2 వేల కోట్ల పైనే ఆస్తులు ఉన్నాయి. కుమారుడు అభినవ్ పేరు మీద దాదాపు రూ.500 కోట్ల ఆస్తులు.. కుమార్తె సహస్రకు మరో రూ.500 కోట్ల దాకా ఆస్తులు ఉన్నట్లు పెమ్మసాని అఫిడవిట్‌లో బయటపెట్టారు. ఇవికాక, రూ.72కోట్ల విలువైన భూములు, బిల్డింగులు, తన భార్య పేరు మీద రూ.34.82 కోట్ల విలువైన భూములు ఉన్నట్లు పేర్కొన్నారు. ఓ రైతు కుటుంబానికి చెందిన పెమ్మసానికి ఇన్ని ఆస్తులు ఎలా వచ్చాయనేది ఆసక్తిగా మారింది. పెమ్మసాని చంద్రశేఖర్‌కు అన్ని ఆస్తులు ఎలా వచ్చాయనే విషయం ఆయనే కొన్ని ఇంటర్వ్యూల్లో చెప్పారు. తెనాలి సమీపంలోని బుర్రిపాలెం సొంతూరు. మధ్య తరగతి కుటుంబంలోనే జన్మించారు. డాక్టర్ కావాలనే ఉద్దేశంతో 1993-94లో ఉస్మానియాలో సీటు సాధించారు. కష్టపడి చదువుకుని విదేశాలకు వెళ్లి.. అక్కడ తన ప్రతిభతో బిజినెస్‌లు చేశారు. 2000 ఏడాదిలో అమెరికాకు వెళ్లి.. జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీలో ఐదేళ్లపాటు మెడికల్ టీచింగ్ ఫ్యాకల్టీగా ఉండేవారు. తాను సొంతంగా తయారు చేసిన మెడికల్ నోట్స్‌ను తక్కువ ధరకు ఆన్ లైన్‌లో అందించేవారు. అలా ఆదరణ బాగా దక్కింది. అలా యూ వరల్డ్ ఆన్‌లైన్ ట్రైనింగ్ సంస్థను పెమ్మసాని మొదలుపెట్టారు. దీని ద్వారా నర్సింగ్, ఫార్మసీ, లా, బిజినెస్, అకౌంటింగ్ విభాగాల్లో లైసెన్సింగ్ పరీక్షలకు ట్రైనింగ్ ఇచ్చేవారు. పెమ్మసాని ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి ఎన్నారైలకు ఫ్రీగా వైద్య సేవలు అందించేవారు. వైద్య రంగం, దాని అనుబంధ రంగాల్లో అత్యధిక వ్యాపారాలు చేస్తున్నారు. తెలంగాణ నుంచి బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర రెడ్డి రూ.4,568 కోట్లతో రెండో ధనిక ఎంపీగా నిలిచారు. ఈయన కొండా వెంకట రంగారెడ్డి మనుమడే కాక, అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు ప్రతాప్ సి.రెడ్డికి అల్లుడు. ఈయన 2024 ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులు కూడా భారీగా పెరిగాయి. తాను గత పదేళ్ల క్రితం అఫిడవిట్ వివరించిన ఆస్తులకు, ఇప్పటికి చాలా పెరుగుదల ఉంది. 2019లో కూడా కొండా ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడారు. అప్పటి అఫిడవిట్ లో తన ఆస్తులు రూ.895 కోట్లు అని అఫిడవిట్ లో పేర్కొన్నారు. 2014 లో టీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచినప్పుడు తన ఆస్తులను రూ.528 కోట్లుగా వెల్లడించారు. 2019లో పోలిస్తే ఈ 5 ఏళ్ల వ్యవధిలో కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆస్తుల విలువ 410 శాతం పెరిగినట్లుగా అర్థం అవుతోంది. చేవెళ్ల బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన కొండా విశ్వేశ్వర్ రెడ్డికి అత్యధిక శాతం మెడికల్ రంగంలోనే చాలా పెట్టుబడులు ఉన్నాయి. కొండా విశ్వేశ్వర్ పేరు మీద రూ.1,178.72 కోట్ల ఆస్తులు, ఆయన భార్య సంగీత రెడ్డి పేరు మీద రూ.3,203.90 కోట్ల మేర ఆస్తులు ఉన్నాయి. అపోలో ఆసుపత్రిలోనే ఏకంగా రూ.2,577 కోట్ల విలువైన షేర్లు ఉన్నాయి. చిత్తూరు జిల్లాలో 85 ఎకరాల వ్యవసాయ భూమి, చేవెళ్ల, హైదర్షాకోట్, స్నేహిత హిల్స్‌లో సాధారణ భూములు, బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్‌లో కమర్షియల్ భవనాలు వీరికి ఉన్నాయి. ఇంకా మరెన్నో ఆస్తులు ఉన్నాయి.

# మోడీ ఏక ఛత్రాధిపత్యానికి ఇక చెక్

## ఉమ్మడి పాలనలో ఏకపక్ష నిర్ణయాలు చెల్లవ్


## ఇప్పటికైనా మార్పుతో బీజేపీ మారాలి



**న్యూఢిల్లీ, జూన్ 7 :** దేశంలో అప్రతిహత నేతగా, తిరుగులేని నేతగా గణతికెక్కిన నరేంద్ర మోడీ ప్రధానిగా మనుగడ కోసం ఇతరులపై ఆధారపడవలసిన స్థితి వచ్చింది. భారత ప్రజాస్వామిక చైతన్యం కారణంగానే ఇలా జరిగింది. ఎంతటి వారైనా ప్రజల ముందు దిగదుడుపే అని నిరూపించిన సదర్భం ఇది. మోడీనే మోసి అలసిపోయిన బీజేపీ నేతలకు కలలోనైనా ఊహించలేని పరిణామం ఇది. దేశవ్యాపితంగా ఏ ఒక్క ఎగ్జిట్ పోల్ కూడ చెప్పని స్థాయిలోకి ఆయనను, ఆయన పార్టీని పడగొట్టిన శక్తి ప్రజలదే. ప్రజలను కలవకుండా, ప్రతిపక్షాలతో చర్చించకుండా, పార్టీకి చెప్పకుండా తనకుతోచిన విధంగా ముందుకు సాగుతున్న తీరును ప్రజలు ఈసడించుకున్నారు. ఇక ఈ ఎన్నికల్లో మరో కీలక పరిణామం బిఆర్ఎస్, బిఎస్పి రాజకీయ చిత్రం నుంచి అదృశ్యమయ్యాయి. బిఆర్ఎస్‌గా మారి దేశ రాజకీయాలనే ప్రభావితం చేస్తామన్న కెసిఆర్ స్వంత నియోజకవర్గం లాంటి మెదక్ కూడా గెలవలేకపోయారు. అన్నాడిఎంకె కూడా మొత్తంగా మాయమైపోయింది. ఒడిషాలో బిజెడి కూడా బిజెపి విషయంలో ఊగిసలాడి చివరకు అధికారం పోగొట్టుకోవడమే గాక లోక్‌సభ ప్రాతినిధ్యం కూడా పోగొట్టుకుంది. ఉద్యమాలకూ ఎన్నికలకూ సంబంధం వుండదనే సిద్ధాంతాలు కూడా ఈ ఫలితాలతో తారుమారైనాయి. రైతాంగ ఉద్యమం నడిచిన చోట్ల బిజెపికి తీవ్రమైన దెబ్బ తగిలింది. మొత్తంగా వాతావరణంలో మార్పు తేవడంలోనూ ఆ ప్రభావం పడింది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్, యు.పి, పశ్చిమ ప్రాంతంలో బిజెపి ఓటమికి ఈ ఉద్యమమే కారణంగా భావిస్తున్నారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం వంటి అంశాలను చర్చలోకి తేవడానికి ఆ వర్గాలను ఆకర్షించడానికి కారణమైనాయి. మైనార్టీలలో వచ్చిన మార్పు యు.పి ఫలితంలో కీలక పాత్ర వహించింది. ఏక వ్యక్తి కేంద్రంగా పని చేసే మోడీ మిశ్రమ ప్రభుత్వాన్ని నడపగలరా అనే సందేహాలు కూడా మీడియా బాహాటంగానే వ్యక్తం చేసింది. కార్పొరేట్ శక్తులు తమ ప్రయోజనాల కోసం ఎంతైనా ఒత్తిడి తెస్తుంటాయి. భారత రాజ్యాంగ రక్షణ అనే అంశాన్ని కేంద్ర బిందువుగా చేసుకుని కాంగ్రెస్ చేసిన ప్రచారాన్ని ప్రజలు బలంగా నమ్మారు. దేశ చిత్రపటాన్ని మోడీ ముఖచిత్రంగా మార్చేసిన వైపరీత్యానికి తెర దిగింది. ఓ రకంగా చెప్పాలంటే పార్లమెంటులో ప్రజల తీర్పు మోడీ నైతిక పరాజయంగా చూడాలి. ఫాసిస్టు తరహా పాలనకు వ్యతిరేకంగా ప్రజల తీర్పుగా దీన్ని చూడాలి. దేశంలో ప్రజాస్వామిక విలువలను గౌరవించాలని తేల్చిచెప్పారు. ఇండియా' వేదికలో 99 స్థానాలతో కాంగ్రెస్ దాదాపు 40 శాతం ఆధిక్యాన్ని ప్రదర్శించింది. ఈ విధమైన పరిస్థితి వస్తుందని కమలనాథులు ముందుగా ఊహించలేదంటే వారు నేలవిడిచి సాము చేశారని చెప్పాలి. రాజ్యాంగం రాష్ట్రాల హక్కులు, లౌకిక తత్వం, రైతాంగ ఉద్యమాలు, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలు కాకుండా కేవలం వ్యక్తిగతమైన, ఉద్వేగ భరితమైన అంశాలే ఓటర్లను నడిపిస్తాయనే అంచనాతో ఎన్నికల్లోకి వెళ్లిన బిజెపిని గట్టి దెబ్బ కొట్టారు. ఓటర్ల తీర్పు చూస్తే ఇవన్నీ ప్రభావం చూపించాయని అర్థమవుతుంది. త్తరాన, పశ్చిమాన బిజెపి ప్రాబల్యం తగ్గలేదనీ దక్షిణాన, తూర్పున మాత్రమే ఇతరుల ప్రభావం అధికమని భావింఇన వారికి కూడా ఈ ఫలితాలు చెంపదెబ్బలాంటివి. ఉత్తర భారతంలో మోడీ స్వయంగా పోటీ చేయడమే గాక ఆయనతో దీటైన ప్రధాని అభ్యర్థిగా చలామణి అయ్యే యోగి ఆదిత్యనాథ్ పాలించే యుపిలో బిజెపి ఘోరంగా దెబ్బతిన్నది. అయోధ్య రామమందిర ప్రాణప్రతిష్ట ప్రచారం, ప్రతిపక్షాలు వ్యతిరేకమనే ముద్ర ఆదుకోలేక పోయింది. యు.పి లో ప్రతిపక్షాల ముందు బీజేపీ నిలువలేకపోయింది. గతంలో దానికి స్వంతంగా 62 స్థానాలు వస్తే ఈ సారి 33కు పడిపోయాయి. గతంలో అయిదు స్థానాలే వచ్చిన ఎస్‌పి ఇప్పుడు 37తో మొదటి స్థానంలోకి వచ్చింది. ములాయం మరణానంతరం అఖిలేష్ యాదవ్ నాయకత్వంలో ఇదే పెద్ద విజయం. బిఎస్‌పి వేరుగా పోటీ పెట్టి పూర్తిగా ఓడిపోయినా దాని వల్లనే 16 స్థానాలు బిజెపికి పోయాయి. లేకపోతే ఈ సంఖ్య మరింత అధికంగా వుండేది. బీహార్‌లోనూ కొంత ఫలితం వచ్చింది. ఇక బిజెపి కుట్రలతో ప్రలోభాలతో ప్రాంతీయ పార్టీలన్నిటినీ చీల్చిన మహారాష్ట్రలో శివసేన, ఎన్‌సిపి, కాంగ్రెస్ కూటమి పైచేయి సాధించి సీట్లు తెచ్చుకున్నది. బిజెపి 9 సీట్లకు పరిమితమైంది. మొత్తంపైన గతంలో దక్షిణాన 30 సీట్లు వుంటే ఇప్పుడు 41కి చేరాయి. మరో వంక 'ఇండియా' కు గతంలో 58 వుంటే ఇప్పుడు 74కు చేరాయి. ఇక తూర్పున ఒడిషాలో అధికారం, ఆధిక్యత రెండూ దక్కినా బెంగాల్‌లో బీజేపీ గతంలోని స్థానాలు 12కు తగ్గాయి. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్ లలో బీజేపీతో ముఖాముఖి పోటీలో కాంగ్రెస్ స్థానాలు గతంలో కంటే బాగానే పెరిగాయి. రాహుల్ గాంధీ యాత్రలు, కార్యక్రమాలు పార్టీలో కదలిక తేవడమే గాక ఆప్ కూడా కూటమితో కలసి రావడం తోడైంది. బీహార్‌లో ఆర్జేడి కూడా ముఖ్య పాత్ర వహించింది. ఈ విధంగా మొత్తంపైన ఎవరూ ఊహించని విధంగా 'ఇండియా' వేదిక బిజెపి, ఎన్‌డిఎకు దీటుగా నిలిచిందంటే ప్రజల మద్దతే కారణం.

# నైరుతి ప్రభావంతో వర్షాలు

## తెలంగాణలో పిడుగుపాటుకు 9మంది మృత్యువాత



**హైదరాబాద్, ప్రజానావ:** తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పిడుగుపాటుకు 9మంది మృతి చెందారు. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షాలకు ఒక్క మెదక్ జిల్లాలోనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. నైరుతి రుతు పవనాల ప్రభావంతో?. తెలంగాణ మొత్తం మీద ఉరుములు పిడుగులతో కూడిన వానలు పడటంతో, ఉమ్మడి మెదక్ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పిడుగుపాటుతో నలుగురు మరణించారు. మెదక్ జిల్లా హవేళిఘన్‌పూర్ మండలంలోని శమ్నాపూర్ గ్రామానికి చెందిన శేట్టిబోయిన సిద్దయ్య (51), వొడంగుల నందు (22) దగ్గరలోని అడవిలోకి బుధవారం సాయంత్రం పొయ్యిల క్టటెలు తేవడానికి వెళ్లారు. వారి ఇద్దరి మీద పిడుగు పడటంతో, ఇద్దరూ కూడా అక్కడిక్కడే మరణించారు. గ్రామస్థులు ఎంత వెతికినా బుధవారం రాత్రి వరకు వారి ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం గ్రామస్తులంతా కలిసి వెతకగా, సిద్దయ్య, నందు ఇద్దరు కూడా విగతజీవులుగా అడవిలో ఉన్న చిన్న గుట్ట పైన కనిపించారు. మెదక్ జిల్లాలోని కౌడిపల్లి మండలంలోని పీర్లతండాకి చెందిన దలావత్ గెమ్యా నాయక్ (55), తన గ్రామా శివారున పొలంలో పనిచేస్తుండగా ఉడుములు పిడుగులతో భారీ వర్షం పడటంతో, తడవకుండా ఉండటానికి చెట్టు కిందికి పరిగెత్తాడు. చెట్టు మీద పిడుగు పడటంతో, గెమ్యా నాయక్ అక్కడిక్కక్కడే మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలంలో రైతు కూలి మరణించాడు. పక్కనే ఉన్న కర్నాటకకు చెందిన బిల్లిపురం గోపాల్ (40), కోహిర్ గ్రామంలో కూలికి వచ్చాడు. తాను పొలంలో పనిచేస్తుండగా, ఉరుములు పిడుగులతో కూడిన భారీ వర్షం రావటంతో, తాను చెట్టు కిందికి పరిగెత్తుతుండగా పిడుగుపడి అక్కడిక్కక్కడే మరణించాడు. పొట్టకూటి కోసం కూలికి వచ్చిన వ్యక్తి, పిడుగుపడి మరణించడంతో కుటుంబం విషాదంలో మునిగింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లలో నలుగురు చనిపోగా, నాగర్ కర్నూల్ జిల్లాలో మరొకరు మృతి చెందారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలానికి చెందిన భార్యాభర్తలు, అనక సంతోష్ (26), భార్య స్వప్న (22) తమ గ్రామమమైన డొంకర్ గాం శివారులో వారి పొలములో పనిచేస్తుండగా వారిపై పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందారు. నిర్మల్ జిల్లాలోని దిలావర్పూర్ మండలం కాల్వ గ్రామానికి చెందిన మూడరపు ప్రవీణ్ (26) పిడుగు పడటంతో అక్కడిక్కడే మృతి చెందాడు. ఇదే జిల్లా తానూరు మండలం ఎల్వత్ కి చెందిన మాగీర్వాడ్ శ్రీ (13) అనే అబ్బాయి కూడా మృతి చెందాడు. నాగర్ కర్నూల్ జిల్లాలో వెల్దండ గ్రామంలోని దిల్వార్పూర్ కు చెందిన జంగమ్మ (40) తన భర్త కృష్ణయ్య, తల్లి జంగిలి ఈదమ్మతో కలిసి వారి పొలంలో పత్తి విత్తనాలు పెడుతుండంగా, వారి పై పిడుగుపడి జంగమ్మ అక్కడిక్కడే మృతి చెందింది. కృష్ణయ్య, ఈదమ్మ కూడా తీవ్ర గాయాలతో, అపస్మారకస్థితిలోకి వెళ్లారు. వారిని దగ్గర్లోని ఆసుపత్రికి తరలించి, అక్కడినుండి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ కు తరలించారు.



# ధాన్యం ఉత్పత్తిలో అగ్రగామిగా రాష్ట్రం

- రాష్ట్రవ్యాప్తంగా 1.2 కోట్ల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి
- ప్రపంచ వరి సదస్సులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**హైదరాబాద్, ప్రజానావ:** ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్రం అగ్రగామిగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. తెలంగాణలో క్రమంగా ధాన్యం ఉత్పత్తి పెరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రవ్యా ప్తంగా 1.2 కోట్ల ఎకరాల్లో ధాన్యం ఉత్పత్తి జరుగు తున్నదని పేర్కొన్నారు. ఆహార భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందన్నారు. అందరికీ ఆహార భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. హైదరాబాద్‌లోని తాజ్‌కృష్ణ వేదికగా జరుగుతున్న ప్రపంచ వరి సదస్సును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. రెండు రోజులపాటు జరుగుతున్న ఈ సదస్సులో భారత్ సహా 30దేశాలు పాల్గొన్నాయి. శాస్త్రవేత్తలు, రైస్ మి ల్లర్ల సంఘాల ప్రతినిధులతోపాటు 250 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్నారు. భారత్‌లో వరిసాగు, ఉత్పత్తి, నాణ్యత, విదేశీ ఎగుమతుల పెంపుపై చర్చిం చనున్నారు. టెక్నాలజీ, మార్కెటింగ్, ఆహార భద్రత లక్ష్యాలుగా మేధోమథనం జరుగనుంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమన్నారు. ఇటీవలే దశాబ్ది ఉత్సవాలు జరుపుకున్నామని చెప్పారు. రాష్ట్రంలో రైస్ సమ్మిట్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ వరి ఉత్పత్తి థాయ్ లాండ్‌తో సమాన మని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. తమది రైతు అనుకూల ప్రభుత్వమని చెప్పారు. వ్యవసాయా నికి అన్ని రకాలుగా ప్రభుత్వం మద్దతు ఇస్తున్నదని తెలిపారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం కనీస మద్దతు ధరకు సేకరిస్తున్నదని వెల్లడించారు. వివిధ పథకాల కింద పౌష్టికాహారం పోర్టిఫికేషన్ బియ్యం సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 3వేల అత్యాధునిక రైస్ మిల్లులు ఉన్నాయని చెప్పారు.

# పరుగులు పెడుతున్న బంగారం, వెండి ధరలు



**హైదరాబాద్, ప్రజానావ :** యూఎస్‌లో జాబ్ డేటా తర్వాత పేరోల్ డేటా ఫోకస్‌లోకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి పరుగు కొనసాగుతోంది. ప్రస్తుతం, ఔన్స్ బంగారం ధర 2,391 డాలర్ల వద్ద ఉంది. మన దేశంలోనూ క్లళెం లేని గుర్రంలా బంగారం పరుగులు పెడుతోంది. ఈ రోజు 10 గ్రాముల ఆర్నమెంట్ బంగారం (24 కేరెట్లు) ధర 770 రూపాయలు, స్వచ్ఛమైన పసిడి (22 కేరెట్లు) ధర 700 రూపాయలు, 18 కేరెట్ల గోల్డ్ రేటు 570 రూపాయల చొప్పున పెరిగాయి. కిలో వెండి రేటు కేవలం 100 తగ్గింది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి రేట్లు ఇలావున్నాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల ధర 73,420 వద్దకు; 22 క్యారెట్ల ధర 67,300 వద్దకు, 18 క్యారెట్ల బంగారం ధర 55,060 వద్దకు చేరింది. కిలో వెండి ధర హైదరాబాద్ మార్కెట్‌లో 96,100 గా ఉంది. ఏపీ, తెలంగాణవ్యాప్తంగా ఇదే ధర అమల్లో ఉంది. విజయవాడలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 73,420 వద్దకు; 22 క్యారెట్ల ఆర్నమెంటు బంగారం ధర 67,300 వద్దకు; 18 క్యారెట్ల బంగారం ధర 55,060 వద్దకు చేరింది. ఇక్కడ కిలో వెండి ధర 96,100 ఉంది. విశాఖపట్నం మార్కెట్‌లో బంగారం, వెండికి విజయవాడ రేటే అమలవుతోంది.



# ఐర్లాండ్‌పై కెనడా విజయం

## టీ20లో తొలి విజయం నమోదు

**న్యూయార్క్:** టీ20 ప్రపంచకప్ 2024లో కెనడా ఎట్టకేలకు విజయాన్ని నమోదు చేసింది. ఐర్లాండ్‌తో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన కెనడా.. 12 పరుగులు తేడాతో గెలుపొందింది. టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే కెనడాకు ఇది తొలి విజయం. ఈ గెలుపుతో కెనడా



పాయింట్స్ టేబుల్‌లో మూడో స్థానానికి దూసుకొచ్చింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన కెనడా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 137 పరుగులు చేసింది. ఆ జట్టు బ్యాటర్లలో నికోలస్ కిర్టన్(35 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 49) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. శ్రేయస్ మొవ్వ(36 బంతుల్లో 3 ఫోర్లతో 37) కీలక ఇన్నింగ్స్ ఆడారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఐర్లాండ్ బౌలర్లలో క్రెగ్ యంగ్, బ్యారీ మెక్‌కార్తీ రెండేసి వికెట్లు తీయగా.. మార్క్ అడైర్, గారెత్ డెలానీ తలో వికెట్ తీసారు. అనంతరం లక్ష్యచేధనకు దిగిన ఐర్లాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులు చేసి ఓటమిపాలైంది. జియోర్జ్ డాక్‌రెల్(22 బంతుల్లో 29 నాటౌట్), మార్క్ అడైర్(24 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 34) రాణించారు. కెనడా బౌలర్లలో డిలాన్ హేలైర్(2/18), జెర్మీ గోర్డాన్(2/16) రెండేసి వికెట్లు తీయగా.. జునైద్ సిద్దికీ, సాద్ బిన్ జఫర్ తలో వికెట్ పడగొట్టారు. చివరి ఓవర్‌లో ఐర్లాండ్ విజయానికి 17 పరుగులు అవసరమవ్వగా.. జెర్మీ గోర్డాన్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి సంచలన విజయాన్నందించాడు. రెండో బంతికే మార్క్ అడైర్‌ను క్యాచ్ ఔట్ చేసిన జెర్మీ గోర్డాన్.. తర్వాతి నాలుగు బంతుల్లో ఒక్క బౌండరీ ఇవ్వకుండా నాలుగు పరుగులే ఇచ్చాడు.



# బీసీసీఐపై శ్రేయస్ సంచలన వ్యాఖ్యలు

## సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తొలగించడంపై తొలిసారి స్పందించిన అయ్యర్

**ముంబై:** భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ)ని ఉద్దేశించి టీమిండియా స్టార్ బ్యాటర్, కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. కెప్టెన్‌గా తాను సాధించిన ఐపీఎల్ 2024 విజయం బీసీసీఐకి చెంపపెట్టు అని తెలిపాడు. భారత ఆటగాళ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తనను తొలగించడంపై శ్రేయస్ అయ్యర్ తొలిసారి స్పందించాడు. కానీ నేషనల్ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ) అయ్యర్ ఫిట్‌గా ఉన్నాడని పేర్కొంది. అయితే శ్రేయస్ అయ్యర్ దేశవాళీ క్రికెట్ ఆడకుండా.. ఐపీఎల్ 2024 సీజన్ కోసం ప్రిపరేషన్స్ మొదలు పెట్టాడని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ ప్రచారంపై ఆగ్రహానికి గురైన బోర్డు.. జాతీయ జట్టుకు దూరమైన ఆటగాళ్లంతా.. ఫిట్‌నెస్ సమస్యలు లేకుంటే దేశవాళీ క్రికెట్ ఆడాలని సూచించింది. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ ఆదేశాలను శ్రేయస్ అయ్యర్‌తో పాటు ఇషాన్ కిషన్ బేఖాతరు చేశారు. దాంతో ఈ ఇద్దరినీ సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి బీసీసీఐ తప్పించింది. దాంతో తన తప్పును దిద్దుకునే ప్రయత్నం చేసిన శ్రేయస్ అయ్యర్.. రంజీ ట్రోఫీ ఫైనల్లో ముంబై తరఫున బరిలోకి దిగాడు. ఆ జట్టు విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం ఐపీఎల్‌లో తన అసాధారణ సారథ్యంతో టైటిల్ అందుకున్నాడు. తాజాగా అయ్యర్ తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా.. సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోవడంపై స్పందించాడు. 'టీ20 ప్రపంచకప్‌లో అద్భుత




ప్రదర్శన కనబర్చిన తర్వాత విశ్రాంతి తీసుకోవాలనుకున్నాను. నా ఫిట్‌నెస్ మెరుగుపరుచుకోవడంపై ఫోకస్ పెట్టాలనుకున్నాను. నా శరీరాన్ని ధృడంగా మార్చాలనుకున్నాను. కానీ మిస్ కమ్యూనికేషన్ కారణంగా నాకు ప్రతికూలమైన నిర్ణయాలు వచ్చాయి. అప్పుడే నేను వీటికి బ్యాట్‌తోనే సమాధానం చెప్పాలని గట్టిగా నిర్ణయించుకున్నా. అద్భుత ప్రదర్శన కనబర్చి టైటిల్ గెలవాలనుకున్నా. అనుకున్నట్లుగానే రంజీ ట్రోఫీ, ఐపీఎల్ టైటిల్ సాధించాను. ఈ నా విజయాలు నాకు ప్రతికూలంగా తీసుకున్న నిర్ణయాలకు చెంపపెట్టు. నా విజయాల పట్ల నేను గొప్పగా ఫీలవుతున్నా' అని శ్రేయస్ అయ్యర్ చెప్పుకొచ్చాడు.

# అలా జరిగితే పాక్‌కు కష్టమే

## సూపర్-8 చేరాలంటే భారత్‌పై గెలవాల్సిందే




**న్యూయార్క్:** టీ20 ప్రపంచకప్ 2024లో పాకిస్థాన్ శుభారంభం అందుకోలేక పోయింది. పసికూన అమెరికా చేతిలో చిత్తయ్యింది. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీయగా అనవసర తప్పిదాలతో పాకిస్థాన్ మూల్యం చెల్లించుకుంది. ఈ ఓటమి పాకిస్థాన్ జట్టును క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టేసింది. గ్రూప్-ఏలో భారత్, యూఎస్ఏ, కెనడా, ఐర్లాండ్‌తో ఉన్న పాకిస్థాన్ తొలి మ్యాచ్ ఓటమితో డేంజర్ జోన్‌లో నిలిచింది. పాకిస్థాన్ తమ తదుపరి మ్యాచ్‌లో భారత్‌తో తలపడనుంది. ఆదివారం జరగనున్న ఈ హైఓల్టేజ్ మ్యాచ్‌కు ముందు పాకిస్థాన్ పసికూన అమెరికా చేతిలో ఓడిపోవడం ఆ జట్టు ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది.

### డేంజర్ జోన్‌లో దాయాది జట్టు..

ఈ టోర్నీలో పాకిస్థాన్ ముందడుగు వేయాలంటే భారత్‌పై విజయం సాధించడం తప్పనిసరి. ఒకవేళ ఈ మ్యాచ్‌లో ఓడినా.. వర్షం కారణంగా రద్దయినా పాకిస్థాన్ క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. ఆతిథ్య అమెరికా వరుసగా కెనడా, పాకిస్థాన్ జట్లను ఓడించి నాలుగు పాయింట్స్‌తో ప్రస్తుతం గ్రూప్-ఏ టాపర్‌గా కొనసాగుతోంది. ఐర్లాండ్‌పై గెలిచిన భారత్ రెండో స్థానంలో ఉండగా.. పాకిస్థాన్, కెనడా, ఐర్లాండ్ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. అగ్రస్థానంలో ఉన్న అమెరికా తమ చివరి లీగ్ మ్యాచ్‌ల్లో భారత్, ఐర్లాండ్‌తో ఆడనుంది. ఈ రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా అమెరికా ఖాతాలో 6 పాయింట్స్ చేరుతాయి.

### అమెరికాతో పోటీ..

మరోవైపు పాకిస్థాన్.. భారత్ చేతిలో ఓడి ఐర్లాండ్, కెనడాపై గెలిచినా 4 పాయింట్స్ వస్తాయి. అప్పుడు పాకిస్థాన్ టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వస్తుంది. ఒకవేళ పాకిస్థాన్ భారత్ చేతిలో ఓడి.. ఐర్లాండ్, కెనడాపై గెలిచి సూపర్-8 చేరాలంటే ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. మిగతా జట్లు కూడా రెండేసి మ్యాచ్‌లు ఓడిపోవాలి. అప్పుడు రన్ రేట్ కీలకం అవుతోంది. అప్పుడు మెరుగైన రన్‌రేట్ ఉన్న జట్టు టోర్నీలో ముందడుగు వేస్తోం ది. ప్రస్తుతం పాకిస్థాన్‌కు అమెరికాతోనే పోటీ నెలకొంది. ఇక పాకిస్థాన్‌ను ఓడిం చిన అమెరికాకు ఐర్లాండ్‌ను ఓడించడం పెద్ద కష్టం కాకపోవచ్చు. పైగా సొంత గడ్డపై ఈ టోర్నీ జరుగుతుండటం ఆ జట్టుకు కలిసొచ్చే అంశం. మరోవైపు పాకిస్థాన్ బ్యాటింగ్, ఫీల్డింగ్, బౌలింగ్‌లో బలహీనంగా కనిపిస్తోంది. ఈ చికాకులు ఏం లేకుండా పాకిస్థాన్ సూపర్-8కు చేరాలంటే భారత్‌ను ఓడిం చాలి. అప్పుడే ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా పాక్ టోర్నీలో ముందడుగు వేస్తోంది. పసికూన చేతిలో ఓడి పుంజుకోవడం పాకిస్థాన్‌కు కొత్త కాదు. గత టీ20 ప్రపంచకప్ 2024లో పాక్ జింబాబ్వేతో ఓడింది. ఆ తర్వాత సంచలన ప్రదర్శనతో ఫైనల్ చేరింది.

# హిట్‌మ్యాన్‌ను ఔట్ చేయడం కష్టమే

## పాక్ పేసర్ మహమ్మద్ అమీర్




**న్యూయార్క్:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మపై పాకిస్థాన్ స్టార్ పేసర్ మహమ్మద్ అమీర్ ప్రశంసల జల్లు కురిపించాడు. హిట్ మ్యాన్ అత్యంత ప్రమాదకరమైన బ్యాటర్ అని కొనియాడిన అమీర్.. క్రీజు లో సెట్ అయితే ఔట్ చేయడం చాలా కష్టమని తెలిపాడు. బంతి కొత్తగా ఉన్నప్పు డే ఇన్నింగ్స్ ఆరంభంలోనే రోహిత్ శర్మ ప్యాడ్స్‌ను టార్గెట్ చేస్తూ బౌలింగ్ చేస్తేనే ఔట్ చేయగలమని అభిప్రాయపడ్డాడు. అలా కాకుండా రోహిత్ శర్మ 15-20 బం తులు ఆడితే ఏ బౌలర్ కూడా అతన్ని ఇబ్బంది పెట్టలేరని స్పష్టం చేశాడు. టీ20 ప్రపంచకప్ 2024లో భాగంగా భారత్ వర్సెస్ పాకిస్థాన్ మధ్య ఆదివారం హైఓల్టేజ్ మ్యాచ్ జరగనుంది. సుదీర్ఘ విరామం తర్వాత రిటైర్మెంట్‌ను వెనక్కి తీసుకొని పాకిస్థాన్ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చిన మహమ్మద్ అమీర్.. బిగ్ మ్యాచ్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడాడు. రోహిత్ శర్మ బలం, బలహీనత తనకు బాగా తెలుసని చెప్పాడు. 'రోహిత్ శర్మ ఓ వరల్డ్ క్లాస్ ప్లేయర్. అతను ఒక్కసారి సెట్ అయితే ప్రమాదకరంగా మారిపోతాడు. ఏ బౌలర్‌ను కూడా వదలుకుండా చెలరేగుతాడు. ఆరంభంలోనే అతన్ని ఔట్ చేసే ప్రయత్నం చేయాలి. కొత్త బంతితోనే నిలకడగా అతని ప్యాడ్స్‌పై హిట్ చేయాలి. అప్పుడే రోహిత్ ఔటవుతాడు. గతంలో నేను ఇలానే రోహిత్ శర్మను ఔట్ చేశాను. అలా కాకుండా హిట్ మ్యాన్ 15-20 బంతులు ఎదుర్కొంటే బౌలర్లకు తన విశ్వరూపం చూపిస్తాడు. అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాడు.' అని కొనియాడాడు.

Printed, Published and Owned by Adula Thirupathi, Printed at Ramani Web Offset Printers, H.No 8-82/11/1, Auto Nagar, Bommakal Road, Village, mdl & Dist : Karimnagar 505001,Telangana State, Published from 2-5-23, Mudhiraj street, Vemulawada Town, mandal, Siricilla Dist, (Karimnagar Dist) 505302,Telangana State. **Editor: Adula Thirupathi.** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277. TELTEL02116